వైఎస్ఆర్
# కడప-అన్నమయ్య
తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
ఆదివారం 28 జూన్ 2026

## శ్రీ రామ, శ్రీ కృష్ణ దేవాలయముల భూమి పూజ చేసిన ఎమ్మెల్యే వరదరాజుల రెడ్డి



**ప్రొద్దుటూరు అర్బన్, జూన్ 27, ప్రభాతవార్త**

ప్రొద్దుటూరు పట్టణం గోకుల్ నగర్ 2 నందు శ్రీ రామ శ్రీ కృష్ణ దేవాలయముల శంకు స్థాపన శనివారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి ,మాజీ ఎంపీపీ నంద్యాల రాఘవరెడ్డి ముఖ్య ఆహ్వానితులుగా హాజరై శంకుస్థాపన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ బచ్చల పుల్లయ్య గారు, ఎండోమెంట్ ఆఫీసర్ రమణ,శంకర్ రెడ్డి,అరటి పండ్ల రమణ,బాతుబోయిన సుబ్బారావు,బుతూరు వెంకట్రామిరెడ్డి,తిప్పిరెడ్డి పల్లె దస్తగిరి,గోపాల్,ఓబుల్ రెడ్డి,టీచర్ రామసుబ్బయ్య,కొర్రపాడు రామసుబ్బయ్య,గోకుల్ నగర్ బ్రహ్మం,కృష్ణాలయం కమిటీ సభ్యులు,గోకుల్ నగర్ ప్రజలు పాల్గొన్నారు.

## ప్రత్యేక పూజలందుకొన్న వెంకటేశ్వర స్వామి



**సుండుపల్లి, జూన్ 27,ప్రభాతవార్త :**

మండల పరిధిలోని ఎన్‌జేఆర్ కాలనీ ఆరోగ్యపురంలో వెలసిన శ్రీ శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి దేవాలయంలో శనివారం ప్రత్యేక పూజా నిర్వహించారు. స్వామివారికి అభిషేకం, పూల అలంకరణ అనంతరం మంత్రోచ్చరణల మధ్య పూజా కార్యక్రమాలు నిర్వహించి అనంతరం ధూప, దీప, నైవేద్యాలు సమర్పించి మహాహారతి నిర్వహించారు. తదుపరి మహాగణపతి స్వామి, ఆంజనేయస్వామి, గరుడ స్వామి, తులసి మాత అమ్మవారికి ప్రత్యేక పూల అలంకరణ చేసి మంత్రోచ్చరణలతో ధూప దీప నైవేద్యాలు సమర్పించారు. ఈ సందర్భంగా ఆలయానికి విచ్చేసిన భక్తులు తలనీలాలు సమర్పించుకొని మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం ఆలయ అర్చకులు భక్తులకు గోత్రనామాలతో ఆశీర్వచనాలు అందించి తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, భక్తులు పాల్గొన్నారు.

# వర్షం కోసం ఎదురుచూస్తున్న రైతాంగం

## దుక్కులు కూడా దున్నని రైతులు ఈ ఏడాది ఖరీఫ్‌సాగు లేనట్లేనా ?



దుక్కలు దున్నుతున్న రైతన్న

**మదనపల్లె, జూన్ 27 ప్రభాతవార్త :**

వర్షం కోసం రైతులు గత కొన్నాళ్ళుగా ఎదురు చూస్తున్నారు. వర్షాభావ పరిస్థితుల వల్ల ఖరీఫ్‌సీజన్‌లో సాగు చేసేందుకు దుక్కులు కూడా దున్నలేదు. ఆరుద్రల కార్తె వచ్చినా ఖరీఫ్‌సాగుకు నోచుకోకపోవడంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. గత ఏడాది ఆరుద్రుల కార్తె రాకమునుపే వర్షం సంతృప్తిగా పడడంతో రైతులు ఖరీఫ్ సాగును చేయడం జరిగింది. ఈ ఏడాది ప్రారంభం నుంచి వర్షాభావం నెలకొనడం వల్ల కరువు పరిస్తితి వస్తుందంటూ రైతులు ఆందోళన చెందుతున్నారు. ఎలినోనా ప్రభావంతో వర్షాలు అరకొరకగా వస్తాయంటూ శాస్త్రవేత్తలు చెబుతుండడంతో రైతులు మరింత ఆందోళనకు గురవుతున్నారు. జూన్ చివరిమాసంలో కూడా వేసవిని తలపించేలా ఉష్ణోగ్రతలు ఉండడంతో భూగర్భజలాలు అడుగంటిపోతున్నాయి. వర్షాభావ పరిస్తితుల వల్ల బోర్లలో కూడా నీటిశాతం తగ్గడంతో సాగు నీటి కోసం రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వ్యవసాయ అధికారులు సైతం రైతులకు అవగాహన కల్పిస్తూ ఆరుతడి పంటలనే సాగు చేయాలంటూ సూచనలు ఇస్తున్నారు. రాయలసీమలోని అన్నమయ్య, చిత్తూరు, అనంతపురం, కడప జిల్లాల్లో రైతులు వర్షాలపైనే ఆధారపడి పంటలు సాగు చేస్తారు. ఈ ఏడాది వర్షం పడకపోవడంతో ఖరీఫ్ సీజన్‌కు వట్టిమావిగానే ఉంటుందంటూ పలువురు చెబుతున్నారు. వ్యవసాయ బోర్ల కింద టమోటాను సాగు చేయడం జరిగింది. టమోటాకు కూడా గిట్టుబాటుధరలు లేకపోవడంతో రైతులు నష్టాలు చవిచూస్తున్నారు. ఇక వేరుశెనగ పంట కనుచూపు మేరకు సాగు చేయడం లేదు. ప్రభుత్వం మాత్రం రైతులకు వేరుశెనగ విత్తనాలను పంపిణీ చేయడం జరిగింది. ఏరువాక పౌర్ణమి వస్తున్నా వర్షాభావ పరిస్థితుల వల్ల సాగు చేసేందుకే రైతులు ముందుకు రావడం లేదు. ఎలినోనా ప్రభావం ఎక్కువుగా ఉంటుందంటూ అధికారులు సైతం చెప్పడం జరుగుతోంది. చెరువుల్లో కూడా నీరు లేక బావురుమంటున్నాయి. ఈ ఏడాది సాగునీటితో పాటు తాగునీటితో కూడా ప్రజలు ఇబ్బందిపడే పరిస్తితులు వస్తాయంటూ పలువురు చెబుతున్నారు.

## జనసేన అధ్యక్షులు శ్రీ పవన్ కళ్యాణ్ దిశానిర్దేశంతో కొత్త కమిటీల కార్యాచరణకు మరింత వేగం



**పీలేరు జూన్ 27 ప్రభాతవార్త:**

జనసేన పార్టీ జనసేన సారథులు సమాచార సేకరణ కార్యాచరణ సమావేశం నిర్వహించారు. మంగళగిరిలోని సి.కె.కన్వెన్షన్‌లో నిర్వహించిన "జనసేన సారథుల సమాచార సేకరణ కమిటీ కార్యాచరణ సమావేశం"లో జనసేన పార్టీ అధ్యక్షులు శ్రీ పవన్ కళ్యాణ్ గారు కమిటీ సభ్యులు, పార్టీ సారథులు, కార్యకర్తలను ఉద్దేశించి ప్రసంగించారు. కమిటీ భవిష్యత్ కార్యాచరణపై స్పష్టమైన మార్గదర్శకాలు అందించడంతో పాటు, అధ్యయనం చేయాల్సిన అంశాలపై సమగ్ర సమాచార పత్రాలను అందజేశారు. ఈ సమావేశం, చర్చలు పార్టీ భవిష్యత్ కార్యాచరణకు మరింత స్పష్టతను, సానుకూల దిశను అందించాయి. జనసేన సిద్ధాంతాలను ప్రజల్లోకి మరింత బలంగా తీసుకెళ్లేందుకు సమిష్టిగా పనిచేయాలనే సంకల్పాన్ని మరింత బలోపేతం చేశాయి. కలప రవి, ఉమ్మడి చిత్తూరు జిల్లా కార్యదర్శి జనసేన పార్టీ, పిలేరు నియోజకవర్గం.

## తప్పులు లేని ఓటర్ల జాబితా

# రూపకల్పనే లక్ష్యం

### జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్



క్షేత్రస్థాయిలో ఇంటింటికి వెళ్లి పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్

**పీలేరు,గుర్రంకొండ, జూన్ 27 ప్రభాతవార్త:**

జిల్లాలో తప్పులు లేని ఓటర్ల జాబితా రూపకల్పనే లక్ష్యం, ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని జిల్లావ్యాప్తంగా పూర్తిస్థాయి పారదర్శకత, నిష్పాక్షికతతో నిర్వహించి తప్పులు లేని ఓటర్ల జాబితా రూపొందించే దిశగా అధికారులు పనిచేయాలని జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ ఆదేశించారు. శనివారం గుర్రంకొండ మండల కేంద్రంలోని పోలింగ్ కేంద్రాలు నెం.16, 17 పరిధిలో నిర్వహిస్తున్న ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి బూత్ లెవల్ అధికారులు నిర్వహిస్తున్న సర్ ఏన్యుమరేషన్ ఫారాల పంపిణీ, నమోదు ప్రక్రియ, ఓటరు వివరాల సేకరణ, ఆన్‌లైన్ డిజిటలైజేషన్ పనితీరును పరిశీలించి సంబంధిత అధికారులకు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఓటర్ల వివరాల నమోదు ప్రక్రియలో ఖచ్చితత్వం, పారదర్శకత అత్యంత ముఖ్యమని తెలిపారు. ప్రతి అర్హత ఓటరికి సంబంధించిన సమాచారం సక్రమంగా నమోదు చేసి, సేకరించిన వివరాలను ఆలస్యం లేకుండా డిజిటలైజేషన్ చేయాలని సూచించారు. బీఎల్‌ఓలకు కేటాయించిన విధులు, బాధ్యతలను వారే వ్యక్తిగతంగా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ఈ పనులను అనధికార వ్యక్తులకు అప్పగించరాదని స్పష్టం చేశారు. ఎన్నికల ప్రక్రియపై ప్రజల్లో నమ్మకం పెరిగేలా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. అలాగే ఓటర్లు, బూత్ లెవల్ ఏజెంట్లు, సంబంధిత వర్గాలందరితో సమానత్వం, నిష్పాక్షికత పాటిస్తూ వ్యవహరించాలని తెలిపారు. ఓటరు జాబితాపై ఎలాంటి ఫిర్యాదులు, అభ్యంతరాలు వచ్చినా వెంటనే పరిశీలించి నిబంధనల మేరకు తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో జరుగుతున్న ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని ప్రజలకు మరింత చేరువ చేసి, ప్రతి అర్హ ఓటరు పేరు జాబితాలో ఉండేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్ పేర్కొన్నారు. అనంతరం కార్యక్రమ నిర్వహణకు సంబంధించిన వివిధ అంశాలపై అధికారులకు తగు సూచనలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో తాసిల్దార్, బిఎల్వోలు తదితరులు పాల్గొన్నారు.

# 24 గంటల్లోనే చిన్నారి హత్య కేసు చేదించాం

## స్నైపర్ డాగ్, సీసీ కెమెరాల ఆధారాలతో నిందితురాలి అరెస్ట్

### పులివెందుల డీఎస్పీ మురళి నాయక్

**పులివెందుల జూన్ 27 ప్రభాత వార్త :**

నియోజక వర్గ పరిధిలోని లింగాల మండలం లోపట్నూతల గ్రామంలో నాలుగేళ్ల బాలిక నిత్విక అలియాస్ జనని హత్య కేసును పోలీసులు 24 గంటల్లోనే ఛేదించామని, స్నైపర్ డాగ్ (డాగ్ స్క్వాడ్) అందించిన క్లూస్, సీసీ కెమెరాల ఫుటేజీల ఆధారంగా నిందితురాలిని గుర్తించి అరెస్ట్ చేసినట్లు డి.ఎస్.పి మురళి నాయక్ వెల్లడించారు. శనివారం స్థానిక డిఎస్పి కార్యాలయం నందు ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో డిఎస్పి మురళి నాయక్ మాట్లాడుతూ కడప జిల్లా ఎస్పీ నచికేత్ విశ్వనాథ్ ఆదేశాల మేరకు పులివెందుల డీఎస్పీ బి. మురళి పర్యవేక్షణలో పులివెందుల రూరల్ సీఐ కె. శాంతిలాల్, లింగాల ఎస్ఐ జగదీశ్వర రెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలు దర్యాప్తు చేపట్టామని లోపట్నూతల గ్రామానికి చెందిన సృజన, రామాచారి దంపతుల కుమార్తె నిత్విక ఈ నెల 25న సాయంత్రం సమయంలో కనిపించకుండా పోయిందని అనంతరం గ్రామంలోని క్రిష్ణయ్య ఇంటి బయట ఉన్న బాత్‌రూమ్‌లోని నీళ్ల డ్రమ్‌లో బాలిక మృతదేహం లభ్యమైంది. ఈ ఘటనపై నిత్విక తల్లిదండ్రుల పిర్యాదు మేరకు కేసు నమోదు చేసి అన్ని కోణాల్లో విచారణ చేపట్టామని గతంలో కుటుంబాల మధ్య ఉన్న వివాదాల నేపథ్యంలో అనుమానితులపై దృష్టి సారించి సీసీ కెమెరాల ఫుటేజీలను పరిశీలించడం తో పాటు డాగ్ స్క్వాడ్‌ను రంగంలోకి దించి నేర స్థలంలో కీలక ఆధారాలు సేకరించడం జరిగిందని సీసీ కెమెరాల్లో నమోదైన కదలికలు, డాగ్ ఇచ్చిన క్లూస్ ఆధారంగా అదే గ్రామానికి చెందిన గుమ్మన స్వాతి ని అదుపులోకి తీసుకోన్నామని విచారణలో నిందితురాలు స్వాతి నేరాన్ని అంగీకరించినట్లు అధికారులు తెలిపారు. దీంతో ఆమెను ఈ నెల 27న ఉదయం పులివెందుల రూరల్ సర్కిల్ కార్యాలయం వద్ద అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు వెల్లడించారు. నిందితురాలు గుమ్మన స్వాతి (28), లోపట్నూతల గ్రామానికి చెందిన గృహిణిగా పోలీసులు గుర్తించారు. ఇటీవల సృజన కుటుంబం, స్వాతి కుటుంబాల మధ్య పిల్లల విషయంలో ఏర్పడిన వివాదం కారణంగా ఇరువురి మధ్య మనస్పర్థలు కొనసాగుతున్నాయని పోలీసులు తెలిపారు. గతంలో కూడా ఇరువురు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదులు చేసుకోగా, ముందు జాగ్రత్త చర్యగా బైండోవర్ చేసినట్లు పేర్కొన్నారు. కేసును ఛేదించడంలో సీసీ కెమెరాలు, శాస్త్రీయ ఆధారాలు, డాగ్ స్క్వాడ్ కీలక పాత్ర పోషించాయని ఆయన తెలిపారు. ఎలాంటి ప్రత్యక్ష ఆధారాలు లేని ఈ కేసును తక్కువ సమయంలో ఛేదించిన పులివెందుల డీఎస్పీ, సీఐలు, ఎస్ఐలు, ప్రత్యేక బృందాలను జిల్లా ఎస్పీ అభినందించారు. ఈ కార్యక్రమం లో సీఐ లు శాంతి లాల్, శంకర్ రెడ్డి నరసింహులు, ప్రసాద్ రావు, లింగాల ఎస్సై జగదీశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మీడియా సమావేశంలో హత్య గురించి వివరిస్తున్న డిఎస్పి మురళి నాయక్

## రెండు చుక్కలతో పోలియోను తరిమెద్దాం

### ర్యాలీలో డి.ఎం.హెచ్.ఓ



**మదనపల్లె క్రైమ్ జూన్ 27 ప్రభాతవార్త.**

రెండు చుక్కలతో పల్స్ పోలియోను తరిమివేద్దామని డిఎం అండ్‌హెచ్‌ఓ డాక్టర్ లక్ష్మీ నరసయ్య తెలిపారు. శనివారం మదనపల్లిలో పల్స్ పోలియో పై అవగాహనా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డిఎంహెచ్‌ఓ డాక్టర్ లక్ష్మి నరసయ్య మాట్లాడుతూ అప్పుడే పుట్టిన శిశువు నుండి ఐదు సంవత్సరాల లోపు పిల్లలందరికి పోలియో చుక్కలు వేయించి పల్స్ పోలియో కార్యక్రమం విజయవంతం చేయాలన్నారు. జూన్ 28 ఆదివారం జరగబోవు పల్స్ పోలియో కార్యక్రమం కొరకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయడం జరిగిం దన్నారు. ఈ నెల 28 ను2డి 30వ తేది వరకు పల్స్ పోలియో కార్యక్రమం నిర్వహించడం జరుగు తుందన్నారు. మొదటి రోజు ఆదివారం పోలియో చుక్కలు బూత్ యందు వేయటం జరుగుతుందన్నారు. మిగిలిన వారికి ఆశా, అంగన్వాడీ, ఆరోగ్య కార్యకర్తలు ఇంటింటికి వెళ్లి పోలియో చుక్కలు వెస్తారన్నారు. జిల్లా వ్యాప్తంగా ఐదు సంవత్సరాల లోపు పిల్లలు 1,45,790 మందిని గుర్తించడం జరిగిందన్నారు. వీరికి పోలియో చుక్కలు వేయడానికి జిల్లా వ్యాప్తంగా 1218 బూత్లు, 161 రూట్స్, 54 మొబైల్ టీమ్ లు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. సమశ్యాత్మక ప్రదేశాలుగా 108 ప్రాంతా లను గుర్తించామన్నారు. ఈ పోలియో చుక్కల కార్యక్రమం లో మొత్తం 5137 మంది సిబ్బంది పాల్గొం టున్నారన్నారు. ఐదు సంవత్సరాల లోపు పిల్లలకు తప్పక పోలియో చుక్కలను 100 శాతం వేయించి పోలియో వ్యాధి లేని భారత దేశం ఏర్పాటు లో భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. అనంతరం ప్రభుత్వ జిల్లా వైద్యశాల నుండి ర్యాలీ నిర్వహించారు. నిండు జీవితానికి రెండు చుక్కలు, పోలియో అంతం మన పంతం, పోలియో ఆదివారం విజయవంతం చేద్దాం అని నినాదాలు చేస్తూ నేతాజీ సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించి, అక్కడ మానవహారం ఏర్పాటు చేశారు. పోలియో కార్యక్రమం పై డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ మహమ్మద్ రఫీ ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమం లో డిఐఓ డాక్టర్ ఉషశ్రీ, సూపరింటెండెంట్ డాక్టర్ మనసుర్ అహమ్మద్, ఆర్.ఎమ్.ఓ. డాక్టర్ రాధిక ,డిపిఎమ్ఓ. డాక్టర్ రమేష్ బాబు, సిటిఎమ్, బొమ్మనిచెర్వు వైద్యులు డా. ఫర్కాన్, డా. ఝాన్సీ, డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేటర్ మహమ్మద్ రఫీ, పర్యవేక్షకులు రామచంద్ర, శ్రీనివాసులు, ప్రభాకర్, గంగయ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## కులమతాలకు అతీతంగా

# శివాజి విగ్రహం ఏర్పాటు

### ఎమ్మెల్యే షాజహాన్‌బాషా



**మదనపల్లె, జూన్ 27 ప్రభాతవార్త**

కులమతాలకు అతీతంగా చత్ర పతి శివాజి విగ్రహాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా తెలిపారు. శనివారం చిత్తూరు బస్టాండులో మరాఠ సం ఘం ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన చత్రపతి శివాజి విగ్రహాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ భారతదేశ చక్రవర్తి చత్ర పతి శివాజి స్పూర్తితో యువత దేశభక్తిని పెంపొందించుకునే విధంగా రాణించాల న్నారు. వాల్మీకుల మనోభావాలు దెబ్బతినకుండా ఇక్కడ రాబోయే రోజుల్లో వాల్మీకి విగ్రహాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దేందుకు ఏర్పాట్లు చేపడుతానన్నారు. రూ.5లక్షలో వాల్మీకి సర్కిల్ బ్యూటిఫికేషన్ చేపట్టడం జరుగుతుందన్నారు. వా ల్మీకుల మనోభావాల దెబ్బతీసే ప్రసక్తే లేదన్నారు. చిత్తూరు బస్టాండు సర్కిల్ ఎప్ప టికి వాల్మీకుల సర్కిల్‌లాగానే ఉంటుందన్నారు. జై భవాని, జై శివాజి అంటూ నినా దాలు చేశారు. పట్టణంలో ప్రజలు అన్నదమ్ముల వలే కలిసి ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే దొమ్మలపాటి రమేష్, టౌన్‌బ్యాంకు ఛైర్మెన్ నాదేళ్ళ విద్యాసాగర్,మరాఠి సంఘం నాయకులు రెడ్డప్పరావు, టిడిపి రాష్ట్ర ఉపా ధ్యక్షురాలు పచ్చిపాల తులసీ, విశ్వబ్రాహ్మణ కార్పోరేషన్ డైరెక్టర్ రామక్రిష్ణాచారి, బిజెపి ఆనంద్, నారదరెడ్డి, రాధా, పులిమహాలక్ష్మి, జేసిబి వేణు పెద్దసంఖ్యలో మరాఠి సంఘం నాయకులు పాల్గొన్నారు.

## సర్ ఓట్ల కార్యక్రమంలో అర్హులకు

# అన్యాయం జరగదు

### మున్సిపల్ కమిషనర్ లక్ష్మీ నారాయణ



ఉస్మాన్ నగర్‌లో ఓటర్ల జాబితా పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ లక్ష్మీ నారాయణ

**రాజంపేట, జూన్ 27, ప్రభాతవార్త:**

ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమంలో అర్హులకు ఎవరికీ అన్యాయం జరగదని, ఓట్లు ఎక్కడికి పోవాలి రాజంపేట మున్సిపల్ కమిషనర్ ఎస్.లక్ష్మీ నారాయణ స్పష్టం చేశారు. శనివారం ప్రత్యేక సవరణ కార్యక్రమంను ఆయ న ఆకస్మింగ తనిఖీ చేశారు. పలు సచివాలయాల పరిధిలో ప్రజలతో మాట్లాడారు. ఉస్మాన్ నగర్ లో బిఎల్వోలతో కలిసి స్థానికుల అనుమానాలను నివృత్తి చేశారు. ప్రజలకు అవగాహన కల్పించా రు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఆధార్ కార్డు ,పాత ఓటర్ కార్డుల నంబర్లు స్పష్టంగా బిఎల్ఓ లకు అందజేస్తే అన్ని ఓట్లు అలాగే ఉంటాయని ఈ విషయంలో ఎలాంటి అపోహలు అవసరం లేదని స్పష్టం చేశారు.ఓటరు వివరాలకు సంబంధించిన ఏవైనా సందేహాలు లేదా మార్పులు ఉంటే, వార్డు పరిధి లోని బిఎల్ఓను సంప్రదించి అవసరమైన దరఖాస్తు సమర్పించాలని సూచించారు.ప్రజలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన సచివాలయాల పరిధిలో ఎంతమందికి దరఖాస్తులు అందజేశారు, ఎంతమంది దరఖాస్తులు పూర్తిచేసి తిరిగి ఇచ్చారు అన్న రికార్డులను మున్సిపల్ కమిషనర్ పరిశీలించారు.

## వెల్లాల శ్రీ సంజీవరాయ స్వామి మహా కుంభాభిషేకంతో మూలవిరాట్ పునః దర్శనం



**రాజుపాలెం, జూన్ 27, ప్రభాతవార్త.**

మండల పరిధిలోని వెల్లాల పుణ్యక్షేత్రంలో గల శ్రీ సంజీవరాయ స్వామి మహా కుంభాభిషేకంతో భక్తులకు పునః దర్శనం కలగనుంది, కుందూ నది తీరంలో ఎంతో పవిత్రమైన పుణ్యక్షేత్రంలో శ్రీ ఆంజనేయ స్వామి భక్తులకు శ్రీ సంజీవరాయ స్వామిగా దర్శనమిస్తూ పూజలందుకుంటూ భక్తుల కొంగు బంగారంగా కోరికలను నెరవేర్చే గొప్ప మహిమ గల దైవంగా కీర్తించబడే స్వామివారి పురాతన ఆలయ స్థానంలో నూతనఆలయం నిర్మాణం పూర్తయి 29వ తేదీ నుండి జూలై 2వ తేదీ వరకు మహా కుంభాభిషేకం, స్వామివారి మూలవిరాట్ పునః కళకర్షణ, అష్ట బంధన, ఆలయ మహా సంప్రోక్షణ, పంచకోష్ట విగ్రహముల ప్రతిష్ట, విమాన గోపుర శిఖర ప్రతిష్ట మహోత్సవ కార్యక్రమం చైర్మన్ జి.ఎల్ నారాయణరెడ్డి ఆధ్వర్యంలో దేవాదాయ శాఖ నిర్వహిస్తున్నది.. ఆలయ నిర్మాణం మిగతా 2వ పేజీలో

## చారాల వద్ద రోడ్డు ప్రమాదం : వృద్ధుడికి గాయాలు



చౌడేపల్లి, జూన్ 27 ప్రభాతవార్త
మండలంలోని పంచాయతీ కేంద్రం చారాల వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో వృద్ధుడికి తీవ్ర గాయాలైన సంఘటన శనివారం చోటు చేసుకొంది. సోమల మండలం వద్దిపల్లికి చెందిన రామచంద్రయ్య (65) మామిడిని సుద్దగుండ్లపల్లి మార్కెట్‌కు తరలించాడు. ఈ క్రమంలో మార్కెట్ నుంచి డబ్బులతో టూవీలర్‌పై తిరిగి వస్తుండగా చౌడేపల్లి–పలమనేరు ప్రధాన రహదారి చారాల ఉన్నతపాఠశాల వద్ద స్కూటర్ అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో వృద్ధుడికి తీవ్రగాయాలయ్యాయి. గాయపడ్డ అతన్ని స్థానికులు 108సేవల ద్వారా చౌడేపల్లికి తరలించారు. ఇక్కడ అతని ఆరోగ్య పరిస్థితి విషమించడంతో మదనపల్లి ఏరియా ఆసుపత్రికి పంంపించారు.

## ఫల్స్ పోలియోను విజయవంతం చేద్దాం



చౌడేపల్లి, జూన్ 27 ప్రభాతవార్త
చిన్నారులకు చుక్కల మందు ఆరోగ్యానికి శ్రీకారమని మండల వైద్యాధికారి మోనా అన్నారు. ఈనెల 28న జరగనున్న ఫల్స్ పోలియో విజయవంతం కోరుతూ ఆరోగ్య సిబ్బంది ర్యాలీ, బస్టాండులో మానవహారం నిర్వహించారు. మండలంలోని 19పంచాయతీలు, 144గ్రామాల్లో ఫల్స్ పోలియో కార్యక్రమానికి సర్వ సిద్ధం చేశామన్నారు. ఆరోగ్య అధికారుల సర్యవేక్షణలో 5మార్గాల ద్వారా 50కేంద్రాలను ఏర్పాటు చేసి 4849మంది పిల్లలను ఫల్స్ పోలియోలో భాగస్వాములుగా చేస్తామన్నారు. ముఖ్యంగా జనరద్దీ అధికంగా వుండే బస్టాండు కూడళ్ళు, శక్తిక్షేత్రం బోయకొండ వంటి ప్రాంతాల్లోనూ అదనంగా కేంద్రాలు ఏర్పాటు చేస్తామన్నారు. అందరి కృషితో కార్యక్రమాన్ని విజయవంతం చేద్దామని పిలుపునిచ్చారు. ఆరోగ్యకేంద్రం, సచివాలయాల ఎఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, విద్యార్థులు పాల్గొన్నారు.

## పల్స్ పోలియో గురించి చర్చించిన జాయింట్ డైరెక్టర్



సుండుపల్లె, జూన్ 27,ప్రభాతవార్త :
మండల పరిధిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సుండుపల్లె, రాయవరం పిహెచ్‌సి అలాగే బి.జి. రాచపల్లె పిహెచ్‌సి లను ఆంధ్రప్రదేశ్ ఆరోగ్యశాఖ జాయింట్ డైరెక్టర్ ఏం.సునీల్ నాయక్ పల్స్ పోలియో కార్యక్రమం గురించి సందర్శించి చర్చించడం జరిగింది. ఈ సందర్భంగా ఈ రోజు పల్స్ పోలియో జరిగే విధానం, రిపోర్ట్స్, వాక్సిన్, కోల్డ్ చైన్ సిస్టం మొదలగు విషయములపై చర్చించి తగిన సూచనలు సలహాలు ఇవ్వడం జరిగింది. అందరు కార్యక్రమంలో తగు జాగ్రత్తలు తీసుకొని పోలియో చుక్కలు వేసుకోకుండా ఒక పిల్లవాడు కూడ తప్పించు కోకుండా ఉండేలా చూసుకోవాలని, ఇంటింటికి వెళ్లి 2 పోలియో చుక్కలు అప్పుడే పుట్టిన బిడ్డ నుండి 5 సంవత్సరాల పిల్లందరికి చుక్కలు వేపించుకున్నారా లేదా,విచారించి వేపించు కోకుండా ఇళ్ళదగ్గర దొరికితే చుక్కలు వేసి రికార్డు చేసుకొని రిపోర్ట్ పంపాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్స్,దిలీప్,పర్వా ఖానం,సి హెచ్ ఒ రామ కృష్ణయాదవ్, సూపర్ వైజర్లు,అలివేలమ్మ,సదాశివారెడ్డి, రామయ్య, ఫార్మాసిస్ట్ నటేష్ ఆరోగ్యాకార్యకర్తలు, ఏంఎల్ హెచ్‌పిలు సిబ్బంది పాల్గొన్నారు.

## 85 మందికి కంటి వైద్య పరీక్షలు

గాలివీడు జూన్ 27: ప్రభాతవార్త:
మండలంలోని నూలివీడు కేశవ ఉన్నత పాఠశాలలో 85 మందికి ఉచిత కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు.కడప పుష్పగిరి కంటి వైద్య శాల వారి సౌజన్యంతో టీడీపీ నాయకులు వెంకట శివారెడ్డి ఆధ్వర్యం లో శనివారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు.ఈ శిబిరంలో 80 మందికి కంటిపరీక్షలు నిర్వహించి కంటి అద్దాలు మందులు పంపిణీ చేశారు.5 మందికి కంటి ఆపరేషన్ల కోసం ఆసుపత్రికి తరలించారు.ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పార్థసారధి రెడ్డి సింగిల్ విండో అధ్యక్షుడు ప్రభాకర్ రెడ్డి, టీడీపీ నాయకులు నాగేశ్వర రావు టోపీ వలి తదుతురులు పాల్గొన్నారు.

## అన్నమయ్య జిల్లా ఫుట్‌బాల్ జట్టు ఎంపిక



మదనపల్లె, జూన్ 27
ప్రభాతవార్త :
పట్టణంలోని జిల్లా పరిషత్ మైదానంలో శనివారం అన్నమయ్య జిల్లా ఫుట్‌బాల్ సబ్ జూనియర్, జూనియర్ బాలికల విభాగాల్లో జిల్లా జట్లు ఎంపిక జరిగినట్లు జిల్లా అసోసియేషన్ కార్యదర్శి మురళీధర్ తెలిపారు. సబ్‌జూనియర్‌లో 25మంది, జూనియర్‌లో 25మందిని జిల్లా క్యాంపుకు ఎంపిక చేశారు. ఈ ఎంపికైన జట్టుకు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కోచింగ్ ఇవ్వడం జరుగుతుందన్నారు. జూనియర్ జట్టు నంద్యాలలో జూలై 2న రాష్ట్ర పోటీల్లో పాల్గొంటుందన్నారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన బిజెపి జిల్లా అధ్యక్షులు పులి నరేంద్రకుమార్‌రెడ్డి మాట్లాడుతూ క్రీడలు క్రమశిక్షణతో పాటు శారీరక దృఢత్వాన్ని ఇస్తాయన్నారు. జిల్లా క్రీడాభివృద్ధి అధికారి చంద్రశేఖర్, ఎస్ఐ రమాదేవి, నాయకులు విష్ణుచైతన్య, పిల్లస్వామి నాయక్, క్రీడాభారతి జిల్లా సెక్రటరీ నరేష్‌బాబు, ఫుట్‌బాల్ అసోసియేషన్ సభ్యులు లతా, మహేంద్ర, బాలాజి, అంజనప్పలు పాల్గొన్నారు.

## మదనపల్లె అభివృద్ధిపై టిడిపి, వైసిపి చేసింది శూన్యం

### సిపిఎం జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు



మదనపల్లె, జూన్ 27 ప్రభాతవార్త :
మదనపల్లె పట్టణాభివృద్ధికి సంబంధించి తెలుగుదేశం పార్టీ, వైసిపి నాయకులు గొప్పలు చెప్పుకోవడం హాస్యస్పదమని సిపిఎం జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు విమర్శించారు. శనివారం సిపిఎం కార్యాలయంలో జరిగిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి అధికకాలం కాంగ్రెస్, తరువాత టిడిపి, వైసిపి పార్టీలు అధికారంలో ఉన్నప్పటికి మదనపల్లె అభివృద్ధికి ఏమీ చేయలేదని ఆరోపించారు.ప్రజల అవసరాలను పక్కనపెట్టి రాజకీయ లబ్ధికోసం టిడిపి, వైసిపిలు ఒకరిపై ఒకరు బురద చల్లుకోవడం హాస్యాస్పదంగా ఉందన్నారు. అధికారంలోకి వచ్చిన పార్టీ ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలన్నారు. పట్టణంలో దోమల బెడద ఎక్కువుగా ఉందని వీటి నివారణకు చర్యలు చేపట్టాలన్నారు. ట్రాఫిక్‌తో పట్టణ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రజాసమస్యల పరిష్కారానికి ఇరుపార్టీల నాయకులు చర్యలు చేపట్టాలన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని కూటమి ప్రభుత్వం నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఇకనైనా టిడిపి, వైసిపి నేతలు వ్యక్తిగత రాజకీయ విమర్శలు పక్కనపెట్టి మదనపల్లె అభివృద్ధికి కృషి చేయాలన్నారు.

## శ్రీ శ్రీ శ్రీ ప్రసన్న ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు



సుండుపల్లె, జూన్ 27,ప్రభాతవార్త :
మండల పరిధిలోని బహుదా నది ఒడ్డున వెలసి ఉన్న ఆంజనేయ స్వామి ఆలయ పునర్నిర్మాణ కార్యక్రమంలో భాగంగా గర్భగుడి నిర్మాణాన్ని రెడ్డిచెర్ల నాగేశ్వర, సుశీల దంపతులు చేపట్టారు. ఈ సందర్భంగా వారి కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో స్వామివారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.ఈ కార్యక్రమంలో వంటేరు రాజా, ప్రభావతి, రామకృష్ణ, సునీత, సుగుణ, శ్రీను, బాబు, భారతి దంపతులు పాల్గొని స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు సమర్పించారు. అలాగే ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# పార్టీనుంచి గెంటేసినా అనుచిత వ్యాఖ్యలెందుకు : కళ్యాణ్ భరత్

### అభివృద్ధిని పరిచయం చేసింది వైకాపాయే



సమావేశంలో మాట్లాడుతున్న కళ్యాణ్‌భరత్

చౌడేపల్లి, జూన్ 27 ప్రభాతవార్త
కష్టకాలంలో వున్నప్పటికీ రాష్ట్రానికి సంక్షేమం, అభివృద్ధిని చూపించిన ఘనత మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డిదని రాష్ట్ర వైకాపా విద్యార్థి విభాగ సంయుక్త కార్యదర్శి కళ్యాణ్ భరత్ అన్నారు. ఇటీవల తిరుపతి కిరణ్‌రాయల్ మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి, మాజీమంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిలను టార్గెట్ చేసిన అనుచిత వ్యాఖ్యలను ఆయన ఖండించారు. స్థానిక పార్టీ కార్యాలయంలో కళ్యాణ్ భరత్ మాట్లాడుతూ పార్టీ నుంచి గెంటేసిన హీనమైన చరిత్ర తిరుపతి కిరణ్ రాయల్‌కు ఉందన్నారు. అసభ్యకర ప్రవర్తనతో జనసేనలోనే సస్పెండ్ అయిన అతను ప్రజాసేవలో జీరోగా చరిత్రకెక్కారన్నారు. సామాజిక మాధ్యమాల ద్వారా పదేపదే వైకాపా నేతలపై అనుచిత వ్యాఖ్యలు చేసే పద్ధతిని మానుకోవాలని హితవు పలికారు. హైదరాబాదుకు వెళ్ళే టూరిస్టు రాజకీయాలు మాని పుంగనూరులో మాజీ మంత్రి పెద్దిరెడ్డి రాచంద్రారెడ్డి అభివృద్ధిని చూడాలన్నారు. బతుకు తెరువుకోసం కులాన్ని అడ్డు పెట్టుకోవద్దనీ, చేతనైతే మంచి పనులు చేసి కులానికి పేరుతేవాలన్నారు. నోరు అదుపులో పెట్టుకోక పోతే రాబోయేది వైకాపా ప్రభుత్వమేననీ, ప్రజలే తగిన బుద్ది చెబుతారని హెచ్చరించారు. వైకాపా పట్టణాధ్యక్షుడు నున్నా భాస్కర్, నాయకులు గణేష్, చాంద్‌భాషా, వినోద్, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

## పోలియో రహిత సమాజం కోసం రెండు పోలియో చుక్కలు

### వైద్యురాలు శ్రీ గిరీష



పీలేరు, జూన్ 27,
ప్రభాతవార్త:
పోలియో వ్యాధి శాశ్విత అంగవైకల్యానికి కారణమయ్యే వైరస్ కావున నిర్మూలనకు రెండు పోలియో చుక్కలు అప్పుడే పుట్టిన బిడ్డనుండి ఐదు సంవత్సరాలలోపు ప్రతి చిన్నారికి వేయించండని తలుపుల పిహెచ్ సి ప్రధానవైద్యాధికారులు గిరీష్ చంద్రశేఖర్ సంయుక్తంగా తెలిపారు. "రేపే పోలియో ఆదివారం" అంశముపై పీలేరు యల్లమంద క్రాస్‌లో పాఠశాల విద్యార్థులచే తలుపుల పురవీధుల్లో ఆరోగ్య బృందం చే అవగాహన ర్యాలీ నిర్వహించారు. 0 నుండి 5 సంవత్సరాల పిల్లలకు అందరికీ దగ్గర్లోనే పోలియో బూతులో చుక్కలు వేయించి, పోలియో మహమ్మారి నుండి మీ బిడ్డల రక్షించాలని వైద్యాధికారులు ఈ సందర్భంగా తెలియజేశారు. రేపే పోలియో ఆదివారం నిండు జీవితానికి రెండు పోలియో చుక్కలు అని నినా దాలు చేస్తూ ర్యాలీ కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో డిప్యూ టీ హెచ్ఇఓ కొండయ్య, పీహెచ్ యన్.కుసుమ,పర్యవేక్షణ అధికారులు శ్రీనువాసులు, నాగమ్మ,ఏయన్ఎం భార్గవి, లక్ష్మీ,సిహెచ్ఓలు,ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయండి

### తొట్టిగారిపల్లె వైద్యాధికారి రాజేష్ కుమార్



బద్వేల్ రూరల్ ,జూన్ 27,
ప్రభాతవార్త:
ఆదివారం జరగనున్న పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవం తం చేయాలని, తొట్టిగారిపల్లె వైద్యాధికారి రాజేష్ కుమార్ అన్నారు. బద్వేల్ మండలంలోని, తొట్టిగారి పల్లెలో శనివారం పల్స్ పోలియో ప్రోగ్రామ్ మైక్ అనౌన్స్మెంట్ కార్యక్రమాన్ని రాజేష్ కుమార్ ప్రారంభించారు. వ్యాక్సిన్ క్యారియర్లను పరిశీలించారు. ఈ సందర్భంగా రాజేష్ కుమార్ మాట్లాడుతూ, మండలంలో ఏడు రూట్లల్లో పల్స్ పోలియో బూతులను ఏర్పాటు చేశామన్నారు. సుమారు 0 నుండి 5 సంవత్సరాల పిల్లలు 5424 మంది పిల్లలు పల్స్ పోలియో చుక్కలను వేయనున్నట్లు ఆయన తెలిపారు. పల్స్ పోలియో చుక్కలను వేయించుకోవాలని, విద్యార్థులతో ర్యాలీని చేయించి ,పిల్లల తల్లిదండ్రులకు తెలియపరచడం జరిగిందన్నారు.ఈ కార్యక్రమంలో సిహెచ్ఓ చంద్రావతి,డిపిఎంఓ శంభూ ప్రసాద్, హెల్త్ అసిస్టెంట్ వీరి జనార్దన్ రావు, ఏఎన్ఎంలు ,ఆశాలు, తదితరులు పాల్గొన్నారు.

## వెల్లాల శ్రీ సంజీవరాయ స్వామి మహా కుంభాభిషేకంతో మూలవిరాట్ పునః దర్శనం

### మహా కుంభాభిషేకమునకు అన్ని ఏర్పాట్లతో ముస్తాబైన వెల్లాల పుణ్యక్షేత్రం

3కోట్ల 55 లక్షలతో నూతన అంగులతో ఆగమ శాస్త్రానుసారం ఎంతో ఆకర్షణీయంగా రూపుదిద్దుకున్నది. ఈ ఆలయ నిర్మాణం ప్రారంభంలో గొప్ప మహిమగల మూలవిరాట్ విగ్రహం కదల్చకుండా అక్కడే ఉంచి నిర్మాణ పనులు చేపట్టడం జరిగినది. నిర్మాణ దశ నుండి ఇప్పటి వరకు స్వామివారి బాలాలయంలో ఓ ప్రత్యేక విగ్రహం రూపంలో భక్తుల కు దర్శనమిస్తూ పూజలందుకుంటూ వచ్చారు. ఎంతో పురాతన కాలం నుండి శ్రీ ఆంజనేయ స్వామి సంజీవని పర్వతంతో శ్రీ సంజీవరాయ స్వా మిగా దర్శనమిచ్చిన స్వామి పూర్వకాలంలో చిన్న విగ్రహముగా వెలసిన శ్రీ సంజీవరాయ స్వామి దినదినాభివృద్ధి చెందుతూ స్వామివిగ్రహం ఓ గొప్ప మహా విగ్రహముగా ఎదుగుతూ ఉన్న క్రమంలో ఇలా విగ్రహం పెరుగుతూ పోతే ఆలయంలో పూజలు నిర్వహించటం కష్టమవుతుందని గ్రహించిన ఆనాటి వేద పండితులు రాగి కలశం చెంబును స్వామివారి తల పైన బోర్లించడంతో స్వామివారి మూలవిరాట్ విగ్రహం పెరుగుదల ఆగిపోవడం జరిగినది, అలనాటి రాగికలశం చెంబు నేటికీ స్వామి వారి శిరస్సు పైన భక్తులకు నేటికీ దర్శనమిస్తూ ఉంది. అటువంటి మహిమ గల మూలవిరాట్ శ్రీ సంజీవరాయ స్వామి మహా విగ్రహం కదల్చకూ డదని భావించి ప్రత్యేకఇనుప చట్రంతో కప్పి ఉంచి ఆలయ నిర్మాణము గావించటం, ఆ నూతనఆలయం పూర్తి అయినది. ఈ నూతన ఆలయం ప్రారంభోత్సవం తో పురాతన మూలవిరాట్ శ్రీ సంజీవరాయ స్వామి పునఃదర్శనంతో భక్తుల పూజలు అందుకోనున్నారు. నూతన ఆలయ ప్రారంభం,మహా కుంభాభిషేకమునకు వెల్లాల పుణ్యక్షేత్రంలో గల ఆలయాలన్నీ ముస్తాబవుతున్నవి. ఆలయ కమిటీ చైర్మన్ జి.ఎల్. నారాయణరెడ్డి ఆధ్వర్యంలో ఈవో వెంకటరమణ పర్యవేక్షణలో కట్టుదిట్ట ఏర్పాట్లతో ఆగమ శాస్త్ర అనుసారం వేదపండితుల దిశా నిర్దేశములతో ఏర్పాట్లు ఎంతో గొప్పగా జరుగుచున్నవి. మహా కుంభాభిషేక కార్యక్రమాల అనుగుణంగా అన్ని వసతులతో కొత్త హంగులతో పుణ్యక్షేత్రం లోని ఆలయాలు పరిసరాలు సకల వసతులతో వైభవంగా ముస్తాబు అయినవి. ఈ మహా కుంభాభిషేకంనకు పలువురు స్వాములు పీఠాధిపతులు, రాష్ట్ర మంత్రివర్యులు, స్థానిక ప్రజాప్రతినిధులు, ఇతర ప్రముఖులు ఈ కార్యక్రమమునకు హాజరవుతున్నట్లు సమాచారం. స్థల పురాణం : రామ రావణయుద్ధ సమయంలో లక్ష్మణమూర్తి మూర్ఛచెందగా శ్రీరామచంద్ర మూర్తి ఆజ్ఞ మేరకు సంజీవని మూలిక అన్వేషణ నిమిత్తం ఆకాశమార్గమున పయనిస్తున్న సమయంలో సంధ్యా సమయం కావటం సూర్య భగవానునికి ఆర్ఘం ప్రదానం చేయుటకు కుముద్వతి నది ( నేటి కుందూ నది) తీరంలో ఆగటం సంధ్యావందనం సమయంలో అక్కడున్న ముని పుంగవులు ఆంజనేయస్వామిని గుర్తించి ఇక్కడ ఉండాలని వేడుకోవడంతో లేదు నేను శ్రీరాముని ఆజ్ఞ మేరకు సంజీవని పర్వతం చేరుకోవాలని సంజీవని మూలికను త్వరగా తీసుకువెళ్లాలని ఉండటం కుదరదని వెళ్లాలా వెళ్లాలా అని పదేపదే అనడంతో అప్పటి దండకారణ్యం ప్రదేశంలోని కుందూ తీరం ఒడ్డున గల ప్రాంతం నకు వెళ్లాలా అనే నామ ధేయము సార్థకమైనట్లు స్థల పురాణం తెలుపుతున్నది.



ఆంజనేయస్వామి సంజీవని పర్వతంతో తిరుగు ప్రయాణంలో ఈ వెల్లాల కుందూ నదిలో సంజీవని పర్వతం నుండి రెండు ప్రతిమలను జారవిడ్చినట్లు పురాణ గాథ. 15వ శతాబ్దంలో హనుమంత్ మల్లు అనే రాజు వేటామార్గంలో అలసిపోయి అనారోగ్యంతో కొద్దిరోజులు వెల్లాలా ప్రదేశంలో సేద తీర్చు కొను సమయంలో ఒకరోజు రాజుకు ఆంజనేయ స్వామి కలలో కనిపించి కుందూ నదిలో స్వామి విగ్రహం ఉన్నట్లు దానిని వెలికి తీసి ఇక్కడ ప్రతిష్టించాలని అజ్ఞాపించటం ఆ రాజు తన పరివారంతో కుందూ నది అంతా వెతకగా ఆంజనేయ స్వామి ప్రతిమ విగ్రహము బయటపడినది స్వామి చెప్పినట్లు ఆ రాజు విగ్రహం ప్రతిష్టించి ఈ ఆలయమును నిర్మించినట్లు వేద పండితులతో పూజలు నిర్వహించటం ప్రారంభించట జరిగినది దాంతో ఆ రాజుకు కలిగిన అనారోగ్య బాధలు కష్టాలు అన్ని తొలగిపోవడంతో అప్పటినుండి స్వామి వారి దర్శించుకుని పూజించిన వారికి ఎటువంటి కష్టాలైనా తొలగిపోతాయని నమ్మకం తో నేటికీ శ్రీ సంజీవరాయ స్వామి గొప్ప మహిమగల దైవముగా ప్రజలు కొలుస్తుంటారు.పూర్వం ఎంత గొప్ప మహిమగల శ్రీ సంజీవరాయ స్వామి కొలువైన పుణ్యక్షేత్రం వెల్లాలా అంగరంగ వైభవంగా ఎన్నో అగ్రహారాలు వేద పండితులు, సపరివార సేవా పరివారము తో పాటు సబ్బంటు ప్రజలు స్వామివారి సేవలో నివసిస్తూ వెల్లాల పుణ్యక్షేత్రం కలకలాడుతూ ఉండేది. దేవస్థాన ఆస్థాన నర్తకి వంశస్థుల వారసుల వారసురాలు సినిమా నటి శాంతకుమారి, ఆమె తల్లి గారి పేరు మీద ఈ పుణ్యక్షేత్రంలో ఓ మంటపం కూడా నిర్మించబడి ఉన్నది. కాలక్రమేనా పుణ్యక్షేత్రంలో గ్రామం శిథిలావస్థకు చేరుకొని అక్కడి ప్రజలు ఇతర ప్రాంతాలకు తరలి వెళ్లారు. మళ్లీ ఇటీవల కాలంలో వెల్లాల పుణ్యక్షేత్రంనకు పూర్వ వైభవం కలుగుతున్నదని, అందుకు నిదర్శనముగా పుణ్యక్షేత్రంలోని ఆలయాల అభివృద్ధి నిత్యం భక్తుల రద్దీ, అనేక సముదాయాలు నిర్మించబడటం పురాతన ఆలయాల స్థానంలో శ్రీ సంజీవరాయ స్వామి ఆలయం నూతనంగా నిర్మించటం, శ్రీ చెన్నకేశవ స్వామి ఆలయం నిర్మాణమున కూడా ప్రభుత్వం నిధులు మంజూరు కావడం చూస్తుంటే వెల్లాలకు పూర్వ వైభవం రావడంతో పాటు స్వామివారి కీర్తి ప్రతిష్టలు పెరగటం భక్తులు విశేషంగా దర్శించుకుని పూజించటం జరుగుతున్నది.

# టైటాన్ గడియారం కథ యువతకు ఓ ప్రేరణ

పీలేరు జూన్ 27 ప్రభాతవార్త:
ఒకప్పుడు భారతదేశంలో గడియారం అంటే విదేశీ బ్రాండ్లే గుర్తొచ్చేవి. దేశీయంగా తయారయ్యే గడియారాలు చాలా తక్కువ. అలాంటి సమయంలో భారతీయులు ప్రపంచ స్థాయి గడియారం తయారు చేయగలరా అనే సందేహం అందరిలో ఉండేది. కానీ ఒక వ్యక్తి కల, పట్టుదల, దూరదృష్టి ఆ సందేహాన్ని చరిత్రగా మార్చింది. ఆ వ్యక్తి జెర్క్సెస్ దేశాయ్. ఆ కల ఫలితమే టైటాన్ గడియారం.

**కలతో మొదలైన ప్రయాణం**

1970లలో భారతదేశంలో నాణ్యమైన గడియారాల కొరత ఉండేది. ఆ సమయంలో జేఆర్‌డీ టాటా ఆశయాలతో, జెర్క్సెస్ దేశాయ్ భారతదేశం కూడా ప్రపంచ స్థాయి గడియారాలను తయారు చేయగలదని నమ్మారు. అయితే ఆ కలను నిజం చేయడానికి దాదాపు పదేళ్ల పోరాటం చేయాల్సి వచ్చింది. అనుమతులు, సాంకేతిక సమస్యలు, పెట్టుబడులు, మార్కెట్ అనుమానాలు ప్రతి అడుగులో అడ్డంకులే ఎదురయ్యాయి. కానీ వారు వెనక్కి తగ్గలేదు.

**"అసాధ్యం" అన్న మాటను చెరిపేసిన సంస్థ..**

1984లో టైటాన్ ప్రారంభమైంది. అప్పట్లో భారతీయ మార్కెట్లో ఎక్కువగా చవక గడియారాలే ఉండేవి. టైటాన్ మాత్రం ప్రపంచ ప్రమాణాలతో క్వార్ట్జ్ వాచీలను తయారు చేయాలని నిర్ణయించింది. హోసూర్‌లో ఆధునిక తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేసి అత్యుత్తమ నాణ్యతను లక్ష్యంగా పెట్టుకుంది. కొద్ది సంవత్సరాల్లోనే భారతదేశంలో ప్రముఖ గడియార తయారీ సంస్థగా ఎదిగింది.

**విజయం ఒక్కరోజులో రాలేదు..**

మొదటి రోజే టైటాన్ విజయాన్ని అందుకోలేదు. చాలా మంది భారతీయులు విదేశీ బ్రాండ్లను మాత్రమే నమ్మేవారు. అయినప్పటికీ టైటాన్ తన నాణ్యత, డిజైన్, వినియోగదారుల విశ్వాసంతో మార్కెట్లో స్థానం సంపాదించింది. ఒక్కో అడుగు ముందుకు వేస్తూ దేశవ్యాప్తంగా లక్షల మంది మనసులను గెలుచుకుంది.

**యువతకు టైటాన్ నేర్పిన పాఠాలు..**

టైటాన్ సంస్థ చరిత్ర కేవలం ఒక వ్యాపార విజయం మాత్రమే కాదు. అది యువతకు జీవితంలో ఎదగడానికి అవసరమైన అనేక విలువలను నేర్పే ప్రేరణాత్మక గాథ. నేటి పోటీ ప్రపంచంలో యువత తప్పని సరిగా నేర్చుకోవాల్సిన పాఠాలు ఇందులో దాగి ఉన్నాయి. కలలను కనడం మాత్రమే కాదు, వాటిని సాకారం చేసే ధైర్యం కూడా ఉం డాలి, టైటాన్ ప్రారంభమైన సమయంలో భారతదేశంలో ప్రపంచ స్థాయి గడియారాలను తయారు చేయడం అసాధ్యమనే అభిప్రాయం ఉండేది. అయినప్పటికీ ఆ కలను నిజం చేయడానికి ప్రయత్నించారు. అందరూ నమ్మకపోయినా, తమ లక్ష్యాన్ని నమ్మారు. ఇతరులు మీ కలలను చిన్నచూపు చూసినా, మీరు వాటిని నమ్మి కష్టపడితే అసాధ్యం కూడా సాధ్యమవుతుంది. సవాళ్లు విజయానికి అడ్డంకులు కావు, మెట్లు మాత్రమే. టైటాన్ స్థాపనలో అనేక పరిపాలనా, సాంకేతిక, ఆర్థిక సమస్యలు ఎదురయ్యాయి. కానీ ప్రతి సమస్యను ఒక అవకాశంగా మార్చుకున్నారు. జీవితంలో సమస్యలు వచ్చినప్పుడు వెనక్కి తగ్గకూడదు. ప్రతి సమస్య మనల్ని మరింత బలంగా తయారు చేస్తుంది. నాణ్యతకు ప్రత్యామ్నాయం లేదు. తక్కు వ ధరతో కాకుండా, అత్యుత్తమ నాణ్యతతో ప్రజల విశ్వాసాన్ని గెలు చుకోవాలని టైటాన్ నిర్ణయించింది. అదే దాని విజయానికి ప్రధాన కారణం. ఏ రంగంలో ఉన్నా, పని నాణ్యతే మనకు గుర్తింపు తెస్తుంది. షార్ట్‌కట్స్ తాత్కాలిక ఫలితాలనే ఇస్తాయి.టైటాన్ ప్రపంచ స్థాయి బ్రాండ్‌గా మారడానికి దశాబ్దాల సమ యం పట్టింది. సహనం, నిరంతర కృషి, పట్టుదల ఉంటేనే దీర్ఘకాలిక విజయం సాధ్యమవుతుంది.






"టైటాన్ గడియారం సమయాన్ని చూపిస్తుంది. కానీ టైటాన్ చరిత్ర యువతకు జీవితాన్ని ఎలా నిర్మించుకోవాలో నేర్పిస్తుంది. కలలు కనండి, కష్టపడండి, సమయాన్ని గౌరవించండి, నాణ్యతను అలవాటు చేసుకోండి. అప్పుడు విజయం మీ గమ్యం అవుతుంది."

**అన్నమయ్య జిల్లా, డివియంసి సభ్యులు, .బోధిషా వలి.**

## పల్స్ పోలియోపై విస్తృత అవగాహన



ముద్దనూరు, జూన్ 27
(ప్రభాతవార్త):
ముద్దనూరు మండల కేంద్రంలోని వైద్యశాఖ ఆధ్వర్యంలో విస్తృత అవగాహన కార్యక్రమం శనివారం నాడు నిర్వహించారు. ఐదేళ్లలోపు ప్రతి చిన్నారికి తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేస్తూ మైక్ ప్రచారం, అవగాహన ర్యాలీ చేపట్టారు. అవగాహన కార్యక్రమంలో డాక్టర్ ఎం. శ్రీకాంత్, సీహెచ్‌వో వై. ప్రసాద్ యాదవ్, సూపర్‌వైజర్ వై.ఆర్. రామారావు, శివగంగా, జగదీష్, జైకు మార్, ఏఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు, సీహెచ్‌వోలు, ఆశా కార్యకర్తలు, అంగన్ వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

## విద్యుత్ ఘాతంతో రెండు చేతులు కాళ్లు కోల్పోయిన దేవేంద్రకు కృత్రిమ కాలు చేతులు

### రూ.6.35 లక్షలు తో కృత్రిమ కాలు చేతులు అందజేసిన ఎంపీ మిథున్ రెడ్డి

పీలేరు జూన్ 27 ప్రభాతవార్త:
విద్యుద్ఘాతంతో రెండు చేతులు, ఓ కాలు కోల్పోయి ఇంటికే పరిమితమైన ఓ యువకుడికి రూ.6.35 లక్షలతో కృత్రిమ కాలు, చేయి ప్రసాదించిన ఎంపీ మిథున్ రెడ్డి మానవత్వానికి నిలువెత్తు నిదర్శనంగా నిలిచారు. పీలేరు మండలం బాలంవారిపల్లె పంచాయతీ తూగుంటపల్లెకు చెందిన టి. కృష్ణయ్య. భారతమ్మల కుమారుడు టి. దేవేంద్ర బీటెక్ పూర్తి చేశాడు. 2024 ఆగష్టు 15న తమ వ్యవసాయం పొలం వద్దకు వెళ్లిన దేవేంద్ర మోటారు మరమ్మతు పని చేస్తూ ప్రమాదవ శాత్తు విద్యుద్ఘాతానికి గురై రెండు చేతులు. కుడి కాలు కోల్పోయాడు. దీంతో చికిత్స పొంది ఇంటిల్లో మంచానికే పరిమితమయ్యాడు. ఎవరూ దాతలు ముందుకు రాక నిస్సాయస్థితిలో ఉన్న దేవేంద్రను ఆదుకోవడానికి స్థానిక వైఎస్సార్సీపీ నాయకులు విషయాన్ని ఎంపీ మిథున్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఎంపీ మిథున్ రెడ్డి ఎంపీ ల్యాడ్స్ నిధులు రూ.6.35 లక్షల వెచ్చించి హైదరాబాద్ రోబోటిక్ రిహబిటేషన్ సెంటర్లో ఒక కృత్రిమ కాలు, చేయి ఆధునాతన టెక్నాలజీతో దేవేంద్రకు అమర్చారు. కృత్రిమ కాలు, చేయి విజయవంతం కావడంతో శనివారం దేవేంద్ర కుటుంబ సభ్యులు ఎంపీని కలసి కృతజ్ఞతలు తెలిపారు. తనకు పునర్జన్మ ప్రసాదించారని. ఆజన్మాంతం రుణపడి ఉంటామని దేవేంద్ర తల్లిదండ్రులు అన్నారు.

## సర్ ప్రక్రియపై వైకాపాచే అవగాహన



మదనపల్లె, జూన్ 27 ప్రభాతవార్త :
సర్ ప్రక్రియ కార్యక్రమంపై వైకాపా నియోజకవర్గ ఇన్‌చార్జ్ నిస్సార్‌అహ్మద్ పార్టీ నాయ కులు, బిఎల్‌ఏలతో కలసి శని వారం 18వ వార్డులో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా నిస్సార్‌అహ్మద్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరికి ఓటుహక్కు కలిగి ఉండాలని అన్ని పత్రాలతో నమోదు ప్రక్రియ చేపట్టాలన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రతి పౌరుడు ఓటుహక్కు కలిగి ఉండాలని, రాజ్యాంగం కల్పించిన హక్కులను ప్రతి ఒక్కరూ పొందాలని ఎన్నికల సంఘం చేపట్టిన ఎస్ఐఆర్ లో పొందుపరిచిన ప్రతి సమాచారం సమగ్రంగా అందించడం బాధ్యతగా తీసుకొని ఓటుహక్కు పొందాలని పిలుపునిచ్చారు. బిఎల్‌ఏలు క్షేత్రస్థాయిలో పర్యటించి సర్‌పై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. బిఎల్ ఓలు ఇచ్చిన ఓటర్ల ధరఖాస్తు ఫారాలను సమగ్రంగా నమోదు చేయాలన్నారు. ఎవరికైనా ఎన్యుమరేషన్ ఫారం భర్తీలో అనుమానాలు ఉంటే వైకాపా కార్యాలయంలో సంప్రదించాలని కోరారు. 2002 ఓటరు జాబితా పార్టీ బిఎల్‌ఏల వద్ద ఉందని వాటిలో ఎక్కడ ఓటు కలిగి ఉన్నారో తెలుసుకోవా లన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మేధావుల ఫోరం సెక్రటరీ వివిఎస్.రెడ్డి పాల్గొన్నారు.

## మదనపల్లి డాక్టర్ సుబ్బారెడ్డికి రాష్ట్రస్థాయిలో గుర్తింపు



మదనపల్లి, జూన్ 27 ప్రభాతవార్త
మదనపల్లి పట్టణంలో ప్రముఖ చిన్న పిల్లల డాక్టర్ ఏవి సుబ్బారెడ్డికి రాష్ట్రస్థాయిలో గుర్తింపు వచ్చింది.ఈ నియామకంతో మదనపల్లి పేరు మరోసారి రాష్ట్రవ్యాప్తంగా వైద్య ప్రపంచంలో ఖ్యాతి గడించింది. 2026 ఫిబ్రవరిలో ఆంధ్రప్రదేశ్ మెడికల్ కౌన్సిల్ కు జరిగిన ఎన్నికలలో డాక్టర్ ఏవి సుబ్బారెడ్డి భారీ మెజారిటీతో ఘన విజయం సాధించిన విషయం విధితమే.అనంతరం జరిగిన ఆంధ్రప్రదేశ్ మెడికల్ కౌన్సిల్ ఇంటర్నల్ ఎన్నికలలో మొత్తం 25 మెంబర్ల లో 23 మంది తమ ఓటు హక్కును వినియోగించుకోగా, డాక్టర్ ఏ.వి. సుబ్బారెడ్డి 149 ఓట్ల మెజారిటీతో ఆంధ్రప్రదేశ్ మెడికల్ కౌన్సిల్ వర్కింగ్ కమిటీ మెంబర్‌గా గెలుపొందిన విషయం తెలిసినదే.ఆంధ్రప్రదేశ్ మెడికల్ కౌన్సిల్ మొత్తం తొమ్మిది స్పెషల్ కమిటీల నియామకం చేయడం జరిగింది. ఒక్కొక్క కమిటీ లో ఒక చైర్మన్ మరో ఇద్దరు సభ్యులు ఉంటారు.అత్యంత కీలకమైన ఫారిన్ మెడికల్ గ్రాడ్యుయేట్స్ కమిటీకి చైర్మన్‌గా, మరో కీలకమైన యాంటీ క్వాకరీ కమిటీలో సభ్యుడిగా డాక్టర్ ఏ.వి. సుబ్బారెడ్డి నియమించబడ్డారు.గత సంవత్సర కాలంగా ఫారిన్ మెడికల్ గ్రాడ్యుయేట్స్‌కు సంబంధించిన అనేక వివాదాలు తలెత్తాయి. అప్పట్లో డాక్టర్ ఏవి సుబ్బారెడ్డి మెడికల్ కౌన్సిల్ మెంబర్ కానప్పటికి, ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ హాస్పిటల్స్ అండ్ నర్సింగ్ హోమ్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుని హోదాలో ఫారిన్ మెడికల్ గ్రాడ్యుయేట్స్ కు అండగా నిలబడి నిరంతర పోరాటం చేసిన విషయం అందరికీ అందరికీ తెలిసిన విషయమే.ఫారిన్ మెడికల్ గ్రాడ్యుయేట్స్‌కు సంబంధించిన అన్ని విషయాలలో ప్రస్తుతం ఒక పరిష్కారం లభించిందని, భవిష్యత్తులో మళ్లీ ఫారెన్ మెడికల్ గ్రాడ్యుయేట్స్ కు ఎటువంటి సమస్యలు తలెత్తకుండా, అన్ని విషయాలలో సంపూర్ణమైన శాశ్వతమైన పరిష్కారం కనుగొనడమే తన లక్ష్యమని డాక్టర్ ఏవి సుబ్బారెడ్డి తెలియజేశారు.డాక్టర్ ఏ వి సుబ్బారెడ్డి ప్రస్తుతం ప్రైవేట్ హాస్పిటల్స్ అండ్ నర్సింగ్ హోమ్స్ అసోసియేషన్ నేషనల్ ఆర్గనైజేషనల్ సెక్రటరీగా, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా, కర్నూల్ మెడికల్ కాలేజ్ ఓల్డ్ స్టూడెంట్స్ అసోసియేషన్ ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా, బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. డాక్టర్స్‌కు సంబంధించిన అన్ని రకాల అసోసియేషన్లలో ఏకకాలంలో కీలక బాధ్యతలు నిర్వర్తిస్తుండడం చాలా అరుదైన గొప్ప విషయం అని పలువురు కొనియాడుతున్నారు.మదనపల్లి లాంటి మారుమూల ఉన్న ఒక చిన్న ఊరు నుంచి, డాక్టర్లకు సంబంధించిన అన్ని రకాల అసోసియేషన్లలో రాష్ట్ర, జాతీయస్థాయి బాధ్యతలకు ఏకకాలంలో ఎన్నిక కావడం అనేది చాలా అరుదైన గొప్ప విషయమని పలువురు కొనియాడుతున్నారు.

## గురు మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్ కప్ కు విశేష స్పందన




రామసముద్రం, జూన్ 27,
ప్రభాతవార్త :
గురు మెమోరియల్ క్రికెట్ కప్ కు విశేష స్పందన లభిస్తోంది.ఈ నెల 22 వ తేదీ కర్నాటక రాష్ట్రంలో శ్రీనివాసపురం తాలూకాలోని ఒదిలి గ్రామం వద్ద ద్విచక్ర వాహనం ప్రమాదంలో మరణించిన చెంబకూరు పంచాయతీ కేంద్రానికి చెందిన చంద్రశేఖర్ కుమారుడు గురు ప్రసాద్ పేరు మీద బారీ ప్రైజ్ మనీ తో గత రెండు రోజులుగా జరుగుతున్న గురు మెమోరియల్ క్రికెట్ కప్ లో ఇప్పటి వరకు సుమారు 50 జట్లు పాల్గొన్నాయి.చెంబకూరు యువత ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ టోర్నమెంట్ కు విశేష స్పందన లభిస్తోంది.కర్నాటక నుండి కూడా పదుల సంఖ్యలో జట్లు రావడంతో,ఈ టోర్నమెంట్ చూసేందుకు యువత వందల సంఖ్యలో వచ్చి చూసి క్రికెట్ ను ఆస్వాదిస్తున్నారు.క్రికెట్ ఆడడానికి, చూడడానికి వచ్చిన వారందరికీ, గురుప్రసాద్ తండ్రి చంద్రశేఖర్, ఆయన స్నేహితులు, యువత భోజనాలు,చలువ పానీయాలు అందించారు.శనివారం మాత్రమే దాదాపు 500 వందల మందికి అన్నదానం చేశారు.ఈ టోర్నమెంట్ ఫైనల్ మ్యాచ్ సోమవారం జరగనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

### చిన్నారి హత్యోదంతానికి పాల్పడిన వారిని

# శిక్షించి బాధితులకు న్యాయం చేయాలి

**ప్రొద్దుటూరు జూన్ 27 ప్రభాతవార్త**

రుద్ర నియోజకవర్గంలోని లింగాల మండలం లోపట్నూతల గ్రామంలోని విశ్వబ్రాహ్మణ కులానికి చెందిన రామాచారిగారి చిన్నారి హత్యోదంతం దారుణమని ఈ పాశవికానికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించి బాధితులకు న్యాయం చేయాలని శ్రీ విశ్వకర్మ సమైక్య విశ్వబ్రాహ్మణ సంక్షేమ సంఘం విజ్ఞప్తి చేసింది. శనివారం శ్రీ విశ్వకర్మ సమైక్య విశ్వబ్రాహ్మణ సంక్షేమ సంఘం నాయకులు లోపట్నూతల గ్రామానికి చేరుకుని చిన్నారి అంత్యక్రియలలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు పులివెందుల నియోజకవర్గం ఇన్చార్జి బీటెక్ రవిని కలిసి బాధితులకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఇలాంటి పాశవిక చర్యలు పునరావృతం కాకుండా రాష్ట్ర ప్రభుత్వం బాధితుల పక్షాన నిలిచి బాధిత తల్లిదండ్రులను న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఇలాంటి చర్యలు పునరావృతం కాకుండా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు జిల్లా ఇన్చార్జి మంత్రి సవితమ్మ దృష్టికి తీసుకెళ్లి చిన్నారి హత్యకు బాధ్యులైన వారిని కచ్చితంగా శిక్షించి బాధితులకు న్యాయం చేసేలా చర్యలు తీసుకోవాలని కోరనున్నట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణ రాష్ట్ర కార్పోరేషన్ డైరెక్టర్ వడ్ల శ్రీనివాసచారి విశ్వం బ్రాహ్మణ సంఘం నాయకులు జీకే ఆనంద్ జమ్మలమడుగు విశ్వబ్రాహ్మణ సంఘం నాయకులు వీర బ్రహ్మాచారి, శ్రీ విశ్వకర్మ సమైక్య విశ్వబ్రాహ్మణ సంక్షేమ సంఘం కార్యదర్శి ఉత్తరాది రమణాచారి పులివెందుల నియోజకవర్గం అధ్యక్షులు నాగభూషణ ఆచారి మరియు నాయకులు మద్దిలేటి ఆచారి ప్రమీలమ్మ మహేష్ ఆచారి మరియు పెద్ద ఎత్తున సంఘ బంధువులు పాల్గొన్నారు.



## గంజాయి నార్కోటిక్ డ్రగ్స్ ఆరోగ్యానికి హానికరం

**సిద్ధవటం, జూన్ 27 ప్రభాతవార్త**



ప్రస్తుతం సమాజంలో ఎక్కువమంది యువత గంజాయి నార్కొటిక్ డ్రగ్స్ వాడడం వల్ల జీవితాలను నాశనం చేసుకుంటున్నారని ఎక్సైజ్ సీఐ రాజశేఖర్ తెలిపారు. మండల కేంద్రమైన సిద్దవటం లోని ఎక్సైజ్ పోలీస్ స్టేషన్లో ఆయన శనివారం మాట్లాడుతూ యువత, గంజాయి నార్కొటిక్ డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలు వాడడం వల్ల అతను ఏదో సాధించినట్టు మత్తులో అనుకుంటున్నాడని మత్తు పదార్థాలు వాడడం వల్ల జీర్ణ వ్యవస్థ మూత్రపిండాలు కాలేయం పూర్తిగా నాశనం అయిపోతుందని ఆరోగ్యాన్ని చేతులారా పాడు చేసుకుంటున్నారని యువత ఉద్దేశించి తెలిపారు గంజాయి విక్రయించిన ఇంటి యజమాని పై కేసు నమోదు చేసి గృహాన్ని స్వాధీనం చేసుకుంటామని చట్టాలు చాలా కఠినంగా ఉన్నాయన్నారు. యువత మత్తు సూదులు వేసుకోవడం వల్ల మత్తుకు బానిసై పోయి కుటుంబంలో సమస్యలు ఏర్పడతాయని మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని ఎక్సైజ్ సిఐ రాజశేఖర్ తెలిపారు.

## ప్రభుత్వ ఉపాధ్యాయులపై చర్యలు తీసుకోవాలి

**ఎడ్యుకేషన్ జూన్ 27 ప్రభాతవార్త :**

ప్రభుత్వ ఉపాధ్యాయులుగా ఉంటూ ప్రైవేట్ విద్యాసంస్థలను నడుపుతున్న వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని ఏఐఎస్బీ, పీఎస్‌యూ, ఏఐవైఎల్ సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. శనివారం కడప డీఈఓ కార్యాలయం ఎదుట వారు నిరసన ప్రదర్శన చేపట్టారు. పోరుమామిళ్లలో ఎలాంటి అనుమతులు లేకుండా కోచింగ్ సెంటర్, స్కూల్ నిర్వహిస్తున్న ప్రభుత్వ టీచర్లను విధులనుంచి తొలగించాలని కోరుతూ డీఈఓ షంషుద్దీన్‌కు వినతిపత్రం అందజేశారు. నిబంధనలు ఉల్లంఘిస్తున్న వారిపై అధికారులు విచారణ జరిపి చర్యలు తీసుకోకుంటే జిల్లా వ్యాప్తంగా పోరాటాలు చేస్తామని ఏఐఎస్‌బీ రాష్ట్ర అధ్యక్షుడు రాజేంద్ర ప్రసాద్, పీఎస్‌యూ కార్యదర్శి సుబ్బరాయుడు, ఏఐవైఎల్ కన్వీనర్ చిరంజీవి హెచ్చరించారు.

## పేదవారి ఆకలిని తీరుస్తున్న రాజన్న



**ప్రొద్దుటూరు, జూన్ 27, ప్రభాతవార్త**

ప్రొద్దుటూరు పట్టణంలో గత ఐదేళ్లుగా పేదల ఆకలి తీరుస్తున్న టిడిపి పట్టణ అధ్యక్షులు చల్లా రాజగోపాల్ యాదవ్ అభినందనీయులని పలువురు పేర్కొన్నారు. ప్రతి శనివారం మరియు ప్రతి పౌర్ణమి రోజున అన్నదానం చేస్తూ పాదచారుల నిరాశ్రయుల మరియు నిరుపేదల ఆకలి తీర్చడంలో భాగంగా శనివారం స్థానిక మైదుకూరు రోడ్డు లోని అన్నర్ హాల్ సమీపంలో ఏర్పాటుచేసిన అన్నదాన కార్యక్రమాన్ని చల్లా రాజగోపాల్ ప్రారంభించారు. మానవత్వమే మహోన్నత మైన ధర్మమనే భావనతో గత ఐదేళ్లుగా నిరంతరంగా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ అన్నదాన కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు. ఆకలితో ఉన్నవారికి భోజనం అందించడం మనిషిగా ప్రతి ఒక్కరి బాధ్యత అని అభిప్రాయం వ్యక్తం చేస్తూ ప్రజల ఆశీస్సులు, సహకారంతో గత ఐదేళ్లుగా ఈ సేవను కొనసాగిస్తున్నామని తెలిపారు. భవిష్యత్తులో కూడా ఎలాంటి విరామం లేకుండా అన్నదాన కార్యక్రమాన్ని కొనసాగిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో చల్లా రవిశంకర్ యాదవ్, మూరబోయిన శ్రీనివాస్ యాదవ్, చింతల రాఘవేంద్ర యాదవ్, బంగి శివప్రసాద్, కర్ణ యాదవ్, రామచంద్రరాజు, హరి, పూల భాష, నల్లం రవిశంకర్, ఏసునాథరెడ్డి, నేలటూరు సంజీవరాయుడు యాదవ్ పాల్గొన్నారు.

## నిత్విక కుటుంబానికి సంఘీభావం

**బ్రహ్మం గారి మఠం జూన్ 27 ప్రభాతవార్త**

మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వైఎస్సార్ సీపీ జిల్లా విశ్వ బ్రాహ్మణ విభాగం అధ్యక్షుడు గొడ్లవీటి సుబ్రమణ్యం మాట్లాడుతూ, పులివెందుల నియోజకవర్గం లింగాల మండలం లోపట్నూతల గ్రామంలో గుండెల్ని పిండేసే విషాదం విదితమే,ఇద్దరు మహిళల మధ్య వచ్చిన గొడవ, ఒక నిష్కల్మషమైన పసిప్రాణాన్ని బలితీసుకుంది. ఆడుకుంటూ కనిపించిన నిత్విక అనే చిన్నారిని బాత్రూంలోని నీళ్ల డ్రమ్ములో ముంచి దారుణంగా హత్య చేశారు. ఇందుకు వైఎస్ఆర్ సీపీ జిల్లా విశ్వ బ్రాహ్మణ విభాగం అధ్యక్షుడు గొడ్లవీటి సుబ్రమణ్యం నిత్విక కుటుంబానికి సంఘీభావం తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఒక తల్లికి జన్మంతా తీరని శోకాన్ని మిగిల్చాయి అని నిందితురాలుకు కఠిన శిక్ష విధించాలని చిన్నారి నిత్విక కుటుంబానికి అండగా ఉంటామన్నారు.

## స్కూటరిస్టుపై రాళ్ల దాడి.. ఫిర్యాదు

**మదనపల్లెక్రైం, జూన్ 27 ప్రభాతవార్త.**

ద్విచక్ర వాహనంలో వెళ్తున్న ఓ వ్యాపారి పై తురకపల్లి యువకులు రాళ్ల దాడికి పాల్పడిన సంఘటన శనివారం వెలుగు చూసింది. తాలూకా పోలీసులకు బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు వివరాలు.. మండలంలోని పోతబోలు గ్రామం, కురవపల్లికి చెందిన రెడ్డిమోహన్(39) మదనపల్లెలో వ్యాపారం ముగించుకుని బైకుపై ఇంటికి వెళుతుండగా, మార్గ మధ్యంలోని తురకపల్లి వద్ద దారికి అడ్డంగా ఇద్దరు వ్యక్తులు ఉండటంతో హారన్ కొట్టాడు. దీంతో ఆగ్రహించిన షఫీ మరో వ్యక్తి రెడ్డిమోహన్‌పై బండ రాళ్లతో దాడి చేసి చితకబాదారు. ఈ దాడిలో రెడ్డి మోహన్ కుడి చేయి విరగడంతో పాటు తల, శరీరంపై బలమైన గాయాలు అయ్యాయి. కుటుంబీకులు వెంటనే రెడ్డిమోహన్ ను స్థానిక జిల్లా ఆస్పత్రికి తరలించారు. చికిత్స అనంతరం గ్రామస్తులు పెద్ద ఎత్తున తాలూకా పోలీస్ స్టేషన్‌కు చేరుకుని స్టేషన్ ఎదుట ఆందోళన చేశారు. అనంతరం పోలీస్ స్టేషన్ వద్ద బాధితుడికి మద్దతుగా నిరసన తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## అంధుల ఆశ్రమంలో అన్నదానం

**పులివెందుల జూన్ 27 ప్రభాతవార్త :**

పట్టణంలోని శ్రీనివాస థియేటర్ సమీపంలో ఉన్న శ్రీ వీరనారాయణ స్వామి అంధుల ఆశ్రమంలో కీర్తిశేషులు కొంగనపల్లె వెంకట నారాయణ ఐదవ వర్ధంతిని పురస్కరించుకొని శనివారం అన్న ప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. కొంగనపల్లె కుటుంబ సభ్యులు శ్రీనివాసులు, కృష్ణవేణి, రవి, అరుణ, కొండలరావు, రాజేశ్వరి, దేవి, మురళీమోహన్, సుభద్ర తదితరుల ఆధ్వర్యంలో ఈ సేవా కార్యక్రమం జరిగింది. అనంతరం అంధులకు అన్న ప్రసాదాన్ని పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆశ్రమ నిర్వాహకులు అనిమెల రామమోహన్ తదితరులు పాల్గొన్నారు.



## పులివెందుల టీడీపీ కార్యాలయంలో ప్రజాదర్బార్



**పులివెందుల జూన్ 27 ప్రభాతవార్త :**

ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవడమే లక్ష్యంగా పులివెందుల టీడీపీ ఇంచార్జ్ బీటెక్ రవి ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహించారు. పులివెందుల పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా దర్బార్ కార్యక్రమానికి ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై తమ సమస్యలను బీటెక్ రవి దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు తాగునీరు, రహదారులు, పారిశుద్ధం, ప్రభుత్వ పథకాలు, ఇతర స్థానిక సమస్యలకు సంబంధించిన వినతులను అందజేశారు. ప్రజల నుంచి సమస్యలను అడిగి తెలుసుకున్న బీటెక్ రవి, సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజల ఇబ్బందులను తెలుసుకోవడం, వాటికి పరిష్కార మార్గాలు చూపడం తన బాధ్యతగా భావిస్తున్నానన్నారు. పులివెందుల అభివృద్ధి, ప్రజల సంక్షేమమే తన ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ప్రజలకు ఎప్పుడూ అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. ప్రజలతో నేరుగా మమేకమై వారి సమస్యలను తెలుసుకునే ఇలాంటి కార్యక్రమాలు నిరంతరం కొనసాగిస్తామని బీటెక్ రవి అన్నారు. కూటమి నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

## సోమశిల జలాల జీవో197ను అమలు చేయాలి



**బద్వేల్, జూన్ 27, ప్రభాతవార్త**

2019లో సోమశిల వెనుక జలాలను బద్వేల్ ప్రాంతంలోని చెరువులకు తరలించేందుకు జారీ చేసిన జీవో నెం.197ను అమలు చేసి రైతులకు సాగునీరు, ప్రజలకు తాగునీటి సమస్యను పరిష్కరించాలని సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ జిల్లా స్టాండింగ్ కమిటీ సభ్యుడు ఎస్. చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. అలాగే అట్లూరు మండలం వేములూరు బ్రిడ్జి నిర్మాణానికి నిధులు విడుదల చేసి పనులు పూర్తి చేయాలని కోరారు. ఈ మేరకు శనివారం ఉమ్మడి కడప జిల్లా డీసీసీ బ్యాంక్ ఛైర్మన్ మంచూరు సూర్యనారాయణ రెడ్డిని పార్టీ కార్యాలయంలో కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి, సంబంధిత మంత్రులు ఈ అంశంపై ప్రత్యేక దృష్టి సారించి నిధులు విడుదల చేసి పనులు ప్రారంభించాలని కోరారు. అలాగే దశాబ్దకాలంగా పెండింగ్‌లో ఉన్న వేములూరు బ్రిడ్జి నిర్మాణ పనులను చేపట్టి 20కి పైగా గ్రామాల ప్రజల రవాణా సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. వినతిపత్రాన్ని స్వీకరించిన డీసీసీ బ్యాంక్ ఛైర్మ మంచూరు సూర్యనారాయణరెడ్డి మాట్లాడుతూ సమస్యలను ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేష్, సంబంధిత మంత్రులు, జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి త్వరితగతిన పూర్తయ్యేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యులు కే. జకరయ్య, బి. అనిల్, నియోజకవర్గ నాయకులు కే. బాబు, తదితరులు పాల్గొన్నారు.

## మందగిరి శనీశ్వరుడికి ప్రత్యేక పూజలు

**సిద్ధవటం జూన్ 27 ప్రభాతవార్త**

కడప చెన్నై జాతీయ రహదారి కనుములో పల్లె సమీపాన వెలసిన శ్రీశ్రీశ్రీ మందగిరి శనీశ్వరుని ఆలయానికి శనివారం భక్తులు పోటెత్తారు మండలంలోని కడప చెన్నై జాతీయ రహదారి కనుములో పల్లె,గ్రామ సమీపాన వెలసిన శ్రీ శ్రీ శ్రీ మందగిరి శనీశ్వర స్వామి ఆలయానికి శనీశ్వర స్వామి శనివారం శని త్రయోదశి కావడంతో భక్తులు కడప, ప్రొద్దుటూరు, కమలాపురం రాజంపేట, బద్వేలు, సిద్ధవటం మండలాల నుండి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని విశేష పూజలు చేశారు ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు సిద్ధవటం సుబ్రహ్మణ్యం శర్మ మాట్లాడుతూ శనేశ్వర స్వామికి,శని త్రయోదశి సందర్భంగా శనీశ్వరుని స్వామి మూల విరాట్ విగ్రహానికి తైలాభిషేకం, వంటి విశేషమైన పూజలు నిర్వహించామని భక్తులు తమ శని గ్రహ దోష నివారణ కొరకై పూజలు నిర్వహించారని తెలిపారు ఈ కార్యక్రమంలో రామకృష్ణ శర్మ, ఆలయ కమిటీ సభ్యులు తిరుమలయ్య పాల్గొన్నారు.

## ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య

**మదనపల్లెక్రైం, జూన్ 27 ప్రభాతవార్త.**

మదనపల్లె లో ఓ వ్యక్తి ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన విషాదకర సంఘటన శనివారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని పాలెంకొండకు చెందిన చంద్రశేఖర్ (52) కొండమర్రిపల్లి గ్రామం గోవర్ధన నగర్‌లో నివాసం ఉంటున్నాడు. కుటుంబ సమస్యల కారణంగా జీవితంపై విరక్తి చెంది ఇంట్లోనే ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న తాలూకా పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. మృతదేహం ను పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ఆస్పత్రి మార్చురీకి తరలించారు. మృతుడికి భార్య మునిరత్నమ్మ, ముగ్గురు పిల్లలు ఉన్నారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చంద్రమోహన్ తెలిపారు.

# అయోధ్య కుంభకోణం మోడీ ప్రభుత్వానికి మాయని మచ్చ

**వేంపల్లె జూన్ 27 ప్రభాతవార్త**



ఇటీవల పెంచిన పెట్రోలు, డీజిల్ ధరలను తక్షణం తగ్గించాలని రాజ్యసభ మాజీ సభ్యులు,కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మీడియా చైర్మన్ డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి కేంద్రంలోని మోడీ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. అమెరికా ఇరాన్ యుద్ధం కారణంగా అంతర్జాతీయ మార్కెట్లో ముడిచమురు ధర గణనీయంగా పెరిగింది అన్న సాకు చూపి కేంద్రంలోని మోడీ ప్రభుత్వం ఇటీవల పెట్రోలు, డీజలు, వంటగ్యాసు,కమర్షియల్ గ్యాస్ ధరలను విపరీతంగా పెంచి ప్రజలపై పెనుబారం మోపిందని తులసి రెడ్డి గుర్తు చేశారు. ప్రస్తుతం అమెరికా ఇరాన్ మధ్య శాంతి ఒప్పందం కుదిరింది.యుద్ధం ముగిసింది. అంతర్జాతీయ మార్కెట్లో ముడిచమురు ధర బ్యారెల్ కు 120 డాలర్ల నుంచి 70 డాలర్లకు తగ్గింది. ముడి చమురు ధర తగ్గినప్పుడు మరి ఇక్కడ తగ్గించాలి కదా కాబట్టి మోడీ ప్రభుత్వం లీటర్ పెట్రోల్ మీద, డీజిల్ మీద పెంచిన ఎనిమిది రూపాయలను వెంటనే తగ్గించాలని తులసి రెడ్డి డిమాండ్ చేశారు. అయోధ్య కుంభకోణం దాదాపు 200 కోట్ల రూపాయల అయోధ్య కుంభకోణం బిజెపి పార్టీకి, ప్రభుత్వానికి మాయని మచ్చ అని తులసి రెడ్డి అన్నారు. అయోధ్య బాలరాముడి ఆలయానికి భక్తులు సమర్పించిన బంగారము,వెండి వజ్రాభరణాలు, నగదు ఆలయ ఖజానాకు చేరకుండానే కొందరు పక్కదారి పట్టించడం,సొంతం చేసుకోవడం చాలా దురదృష్టకరం. ఏనుగుల భారీ నుండి రక్షించండి గత కొంతకాలంగా రాష్ట్రంలో ఏనుగుల బీభత్సం ఎక్కువైంది. అడవుల నుండి సమీపంలోని గ్రామాలకు చెందిన పంట పొలాల పైబడి పంటను నాశనం చేస్తున్నాయి. ఇప్పటికైనా సంబంధిత శాఖ మంత్రి పవన్ కళ్యాణ్ చొరవ తీసుకొని ఏనుగుల బారి నుండి ప్రజలను,ప్రత్యేకించి రైతులను కాపాడాలని, చనిపోయిన కుటుంబాలకు,నష్టం జరిగిన కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియో, నష్టపరిహారం ఇవ్వాలని తులసి రెడ్డి విజ్ఞప్తి చేశారు. మీడియా సమావేశంలో కాంగ్రెస్ నాయకులు సుబ్రహ్మణ్యం, ధ్రువకుమార్‌రెడ్డి, రామకృష్ణ, రామాంజనేయరెడ్డి, వెంకటేశు, అమర్నాథ్‌రెడ్డి, ఉత్తన్న, తోపిరెడ్డి రవీంద్రనాథ్‌రెడ్డి, బద్రీనాథ్, రాఘవయ్య, వేమా రాజా తదితరులు పాల్గొన్నారు.

## అగస్త్యేశ్వర ఆలయాన్ని పరిశీలించిన స్థపతి

**ప్రొద్దుటూరు అర్బన్ , జూన్ 27, ప్రభాత వార్త**



పట్టణ నడిబొడ్డున వున్న శ్రీ అగస్త్యేశ్వర స్వామి దేవస్థానంలో శనివారం దేవదాయ ధర్మాదాయ శాఖ ప్రధాన కార్యాలయ స్థపతి పరమేశ్వరప్ప సందర్శించి ఆలయ పరిస్థితులను పరిశీలించారు. ఆలయ ఛైర్మన్ వంగల నారాయణ రెడ్డి, ఈఓ కె.వి. రమణ, పాలక మండలి సభ్యులు ఆయనకు స్వాగతం పలికారు. స్వామి అమ్మవార్ల దర్శనం అనంతరం ఆలయ అభివృద్ధికి సంబంధించిన పలు అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఆలయాన్ని సప్పటి పైకి లేపడం, కళ్యాణ మండపంలో గదుల ఏర్పాటు, వసతి సదుపాయాలు, అలాగే మూత్రశాల స్థాన మార్పు వంటి అంశాలు చర్చకు వచ్చాయి. అభివృద్ధి పనులకు సంబంధించిన పూర్తి వివరాలను ముందుగా సమర్పించాలని స్థపతి సూచించినట్లు అధికారులు తెలిపారు.

## చిన్న సింగనపల్లెలో పెద్ద సరిగెత్తు

**దువ్వూరు, జూన్ 27, ప్రభాతవార్త:**

మొహరం వేడుకలలో భాగంగా మండలంలోని చిన్న సింగనపల్లె గ్రామంలో శనివారం సాయంత్రం పెద్ద సరిగెత్తును ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా పీర్ల చావిడి వద్ద పీర్లకు కుల, మతాలకు అతీతంగా గ్రామస్తులు ప్రత్యేక ప్రార్థనలు చేసి చక్కెర, మలీద, పానకంను చదివింపులు చేశారు. అనంతరం పెద్ద పీరు, చిన్న పీర్లతో పాటు బాబా ఫకృద్దీన్ స్వామి పీరును, లాల్ స్వామి తమ ఇంటి వద్దకు రాగానే బిందెలతో నీళ్లు పోసి చెక్కర సధింపులు చెల్లించారు. ముందుగా గుండం వద్ద పెద్ద ఎత్తున మంటలు వేశారు. గుండము చుట్టూ యువకులు, పెద్దలు అలవతొక్కరు. నేడు ఆదివారం పీర్లు తొట్టికి వెళతాయి అని గ్రామ కమిటీ సభ్యులు తెలిపారు.



## చిన్నారి నిత్విక హత్య తీవ్ర విషాదం



**పులివెందుల, జూన్ 27,ప్రభాతవార్త :**

నియోజక వర్గ పరిధిలోని లింగాల మండలం లోపట్నూతల గ్రామంలో నాలుగేళ్ల చిన్నారి నిత్విక హత్య ఘటన తీవ్ర విషాదాన్ని కలిగించిందని పులివెందుల టీడీపీ ఇంచార్జ్ బీటెక్ రవి అన్నారు. బాధిత కుటుంబానికి అన్ని విధాలా అండగా ఉంటామని హామీ ఇచ్చారు.పులివెందుల టీడీపీ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా దర్బార్ కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణ సంఘం నాయకులు బీటెక్ రవిని కలిసి చిన్నారి కుటుంబానికి న్యాయం చేయాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లోపట్నూతల గ్రామానికి చెందిన సృజన, రామాచారి దంపతుల కుమార్తె నిత్విక మృతి ఘటన తనను తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసిందన్నారు.చిన్నారి మృతి విషయం తెలిసిన వెంటనే తన సతీమణి, పులివెందుల జడ్పీటీసీ మారెడ్డి లతా రెడ్డి, తన తమ్ముడు జోగిరెడ్డి, లింగాల మండల టీడీపీ అధ్యక్షుడు విశ్వనాథ రెడ్డి, పులివెందుల మార్కెట్ యార్డ్ ఛైర్మన్ గడ్డం అమర్నాథ్ యాదవ్, కూటమి నాయకులు, కార్యకర్తలు ఆసుపత్రికి వెళ్లి బాధిత కుటుంబాన్ని పరామర్శించినట్లు తెలిపారు. నాలుగేళ్ల చిన్నారిపై జరిగిన ఈ అమానుష ఘటనను తీవ్రంగా ఖండిస్తున్నామని బీటెక్ రవి అన్నారు. కేసులో నిందితురాలు స్వాతిని పోలీసులు అదుపులోకి తీసుకుని చట్టపరమైన చర్యలు చేపట్టారని, బాధిత కుటుంబానికి తప్పకుండా న్యాయం జరుగుతుందని పేర్కొన్నారు.త్వరలోనే స్వయంగా బాధిత కుటుంబాన్ని పరామర్శించి వారికి ధైర్యం చెబుతానని, వారి కుటుంబానికి ఎల్లప్పుడూ అండగా నిలుస్తానని బీటెక్ రవి తెలిపారు. చిన్నారి కుటుంబానికి ప్రభుత్వం అన్ని విధాల సహకారం అందించాలని కోరారు.

## పల్స్ పోలియో విజయవంతం చేయండి..



**సుండుపల్లె, జూన్ 27, ప్రభాతవార్త :**

రాయవరం పిహెచ్‌సిని జాయింట్ డైరెక్టర్ డాక్టర్ సునీల్ నాయక్ ఆకస్మికంగా తనిఖీ చేసారు. ఈరోజు జరుగబోయే పోలియో కార్యక్రమం ఏర్పాట్లు గురించి తనిఖీ చేసారు. వాక్సిన్ గది,మరియు ల్యాబ్ ను పరిశీలించారు. 0 5 సంవత్సరం లోపు పిల్లలు అందరికి పోలియో చుక్కలు వేయించాలని. 100 % పోలియో చుక్కలు వేయించాలని. పోలియో చుక్కలు వేయించడం వలన పోలియో నివారించవచ్చని. పోలియో చుక్కలు వేయించడం వలన అంగవైకల్యం రాకుండా చేయవచ్చని చెప్పారు. ఈ ప్రొగ్రాము నరేష్ డాక్టర్ శేఖర్ రెడ్డి డాక్టర్ రూబీనా ఏంపిహెచ్ఇఒ వీర నారాయణ, సుగుణమ్మ సూపర్ వైసర్ పార్వతమ్మ పాల్గొన్నారు.

## అగ్నిమాపక కేంద్రంలో తనిఖీలు

**పులివెందుల జూన్ 27 ప్రభాతవార్త :**

పులివెందుల అగ్నిమాపక కేంద్రాన్ని ప్రాంతీయ అగ్నిమాపక శాఖ అధికారి (కర్నూలు జోన్) ఎం. భూపాల్ రెడ్డి శనివారం తనిఖీ చేశారు. తనిఖీలలో భాగంగా అగ్నిమాపక సిబ్బంది నిర్వహిస్తున్న విధులు, అత్యవసర సమయాల్లో చేపట్టాల్సిన రక్షణ చర్యలపై పరిశీలన చేపట్టారు.ఈ సందర్భంగా సిబ్బందితో పీటీ డ్రిల్, స్క్వాడ్ డ్రిల్, సాంకేతిక డ్రిల్లులు నిర్వహించి వారి సామర్థ్యాన్ని పరీక్షించారు. ప్రమాద సమయాల్లో ప్రజలను రక్షించేందుకు ఉపయోగించే రెస్క్యూ నాట్ విధానంపై ప్రత్యేక డెమో నిర్వహించారు. ఎత్తైన భవనాల పై అంతస్తుల నుంచి బాధితులను సురక్షితంగా కిందికి తీసుకు రావడం వంటి రక్షణ చర్యలను సిబ్బంది ప్రదర్శించారు. అనంతరం స్టేషన్ లోని రికార్డులు, పరికరాలు, వాహనాల నిర్వహణ తీరును పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. అగ్ని ప్రమాదాలు, విపత్తుల సమయంలో వేగంగా స్పందిస్తూ ప్రజల ప్రాణ, ఆస్తి రక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి యు. శరత్ బాబు, స్టేషన్ ఫైర్ ఆఫీసర్ పి. సునీల్ కుమార్, అగ్నిమాపక సిబ్బంది పాల్గొన్నారు.



## కృషి పట్టుదల ఉంటే దేనినైనా సాధించవచ్చు



**కలసపాడు, జూన్ 27 ప్రభాతవార్త:**

మనిషికి జీవితంలో ఏదైనా సాధించాలని సంకల్పం ఉంటే దాని వెనుక ఉండే అవంతరాలను ఎదుర్కొని అనుకున్న పనిని సకాలంలో సాధించవచ్చని పూర్వ విద్యార్థి అనూషను పేర్కొన్నారు. మండలంలోని స్థానిక సెయింట్ ఆంటోనీస్ ఇంగ్లీష్ మీడియం ఉన్నత పాఠశాలలో 6 తరగతి నుండి 8 ,9 తరగతులు చదివి ఉత్తమ ఫలితాలను సాధించ నన్నారు. అక్కడనుండి ఉన్నత విద్య ఇతర ప్రాంతాలకు వెళ్లి గడచిన డీఎస్సీలో అత్యుత్తమ ర్యాంకును సాధించనన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల యాజమాన్యం కరస్పాండెంట్ చిత్తా, రాజశేఖర్ రెడ్డి, ప్రిన్సిపల్ ప్రభావతి , పాఠశాల ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

## ఘనంగా ముగిసిన భాగవత సప్తాహ పఠనం

**పులివెందుల , జూన్ 27 ప్రభాతవార్త :**

నియోజకవర్గ పరిధిలోని లింగాల మండలం అంభకపల్లి గ్రామంలోని శ్రీ అవధూత అవులస్వామి ఆలయంలో నిర్వహించిన భాగవత సప్తాహ పఠనం మంత్రపుష్పం కార్యక్రమం ఘనంగా ముగిసింది. ఏడు రోజుల పాటు భక్తిశ్రద్ధలతో సాగిన ఈ ఆధ్యాత్మిక కార్యక్రమానికి ముగింపు రోజైన శనివారం భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. చివరి రోజు సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మహిళలు భక్తి భావంతో ఆలయం చుట్టూ కలశ ప్రదర్శన చేపట్టారు. గ్రామ వాతావరణం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది.పులివెందుల భాగవత భక్త సమాజం ఆధ్వర్యంలో గ్రామస్థులు, దాతల సహకారంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమం విజయవంతం కావడానికి సహకరించిన భాగవత పండితులు, భక్తులు, దాతలకు భాగవత భక్త సమాజ పాలకవర్గ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఏడు రోజుల పాటు భక్తులకు అల్పాహారం, అన్నప్రసాదం అందించేందుకు సహకరించిన దాతలను వారు అభినందించారు. భాగవత పండితులకు ప్రత్యేక సత్కారాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సమాజం అధ్యక్షులు చిన్నశివారెడ్డి, గొందిపల్లి నారాయణరెడ్డి, డి. గంగిరెడ్డి, కొట్టాల రంగనాథ్, తొండూరు నారాయణరెడ్డి, మీడియా కన్వీనర్ యాగంటి బాలకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు. భక్తుల రాకతో అంభకపల్లి ఆలయం ఆధ్యాత్మిక కేంద్రంగా మారింది.



# వాసవి కన్యకాపరమేశ్వరి దర్శించుకున్న ఆర్యవైశ్య ప్రముఖులు..

**బ్రహ్మంగారిమఠం జూన్ 27 ప్రభాతవార్త**

శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవి ఆలయాన్ని శనివారం కడప జిల్లా (రూరల్) ఆర్యవైశ్య సంఘం నూతన అధ్యక్షులు వల్లంకొండు వెంకటరమణ, గౌరవ అధ్యక్షులు పివిఎన్ ప్రసాద్, బద్వేల్ పబ్బతి సత్యనారాయణ, పెండ్లిమర్రి సురేష్ బాబు, వల్లంకొండు అనిత్ లకుఆలయ మర్యాదలతో ఆర్యవైశ్య సభ అధ్యక్షులు అయ్యపు వెంకట సురేష్ బాబు ఘనంగా స్వాగతం పలికి కుంకుమ పూజలు, ప్రత్యేక అర్చనలు నిర్వహించారు. అనంతరం నూతనంగా ఎన్నికైన జిల్లా అధ్యక్షులు వల్లంకొండు వెంకటరమణను, గౌరవ అధ్యక్షులు పి.వి.ఎన్. ప్రసాద్‌ను స్థానిక కమిటీ ప్రెసిడెంట్ అయ్యపు వెంకట సురేష్ బాబు శాలువా, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. బ్రహ్మంగారిమఠం ఆర్యవైశ్య సభ అధ్యక్షులుగా సేవలు అందిస్తున్న అయ్యపు వెంకట సురేష్ బాబును కడప జిల్లా ఆర్యవైశ్య సంఘం రూరల్ ఉపాధ్యక్షుడిగా ప్రకటిస్తూ, ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో బ్రహ్మంగారిమఠం ఆర్యవైశ్య సంఘం ఉపాధ్యక్షులు ముచ్చర్ల శేషయ్య, మునగనూరి వెంకటేశ్వర్లు, సుంకు నాగేశ్వరరావు, సెక్రెటరీ సుంకు సురేష్ బాబు, కోశాధికారి దుగ్గిశెట్టి వెంకటేశ్వర్లు, ఉప కోశాధికారి పబ్బతి నాగేశ్వరరావు పాల్గొన్నారు. వీరితో పాటు కార్యవర్గ సభ్యులు ముచ్చర్ల సత్యనారాయణ, పత్తి సురేష్, గౌరవ అధ్యక్షులు సుంకు పెద్ద సిద్దయ్య మరియు పెద్ద సంఖ్యలో స్థానిక ఆర్యవైశ్య బంధువులు పాల్గొని నూతన కార్యవర్గానికి అభినందనలు తెలియజేశారు.

# విద్యార్థులకు కంటి పరీక్షలు..



కడప కార్పొరేషన్ జూన్ 27 ప్రభాతవార్త:

పిల్లలలోని కంటి సమస్యలను గుర్తించుటకు పాఠశాలల్లో దృష్టి పరీక్షల కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎల్ వీపీఐ కన్సల్టెంట్ ఆప్టోమెట్రిస్ట్, మయోపియా స్పెషలిస్ట్, పాఠశాల దృష్టి పరీక్షా కార్యక్రమం హెడ్ డా. శశిబిందు తెలిపారు. పిల్లల మెదడు ఎదుగుదల, అభ్యసించుట, సంపూర్ణ శ్రేయస్సుకు దృష్టి ఎంతో కీలకమన్నారు. శనివారం కడపలోని ఎల్.వి. ప్రసాద్ నేత్ర వైద్య సంస్థ రాజశేఖర్ రెడ్డి ప్రాంగణం పిల్లలకు కంటి పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా చిన్నపిల్లలలో కంటి సమస్యలను గుర్తించి సకాలంలో చికిత్స అందిస్తామన్నారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులలో పిల్లల కంటి ఆరోగ్యంపై అవగాహన కల్పించే లక్ష్యంతో ఎల్.వి. ప్రసాద్ ఐ ఇన్‌స్టిట్యూట్ పనిచేస్తున్నట్లు చెప్పారు. ఎల్.వి. ప్రసాద్ నేత్ర వైద్య సంస్థ పాఠశాల దృష్టి పరీక్షలను శిక్షణ పొందిన కంటి సంరక్షణ నిపుణులు పాఠశాల పిల్లలకు వక్రీభవన లోపాలు, మయోపియా (దగ్గరి చూపు), అంబ్లియోపియా (మందకొడి కన్ను), మెల్లకన్ను ఇతర కంటి సంబంధిత సమస్యల వంటి సాధారణ కంటి రుగ్మతల కోసం పరీక్షలు నిర్వహిస్తారన్నారు. దృష్టి సమస్యలు ఉన్నట్లు గుర్తించిన పిల్లలకు సమగ్ర కంటి పరీక్షల కోసం సిఫార్సు చేస్తామని, కళ్లద్దాలు అవసరమైన వారికి తగిన ప్రిస్క్రిప్షన్‌లు అందజేస్తామన్నారు. తమ పాఠశాలలో పిల్లలకు కంటి పరీక్షా కార్యక్రమాన్ని నిర్వహించుటకు ఆసక్తిగల పాఠశాలలు వారు ఎల్ వీపీఈఐ రాజశేఖర్ రెడ్డి క్యాంపస్, కడప అడ్మినిస్ట్రేటర్ విజయ్ కుమార్ వారిని ఈమెయిల్ ద్వారా యూవిజయ్ కుమార్, ఎల్ వీపీఈఐ డాట్ ఓఆర్ జీ నందు సంప్రదించాల్సిందిగా కోరారు.

# రెండు పోలియో చుక్కలు తప్పనిసరి

రామసముద్రం జూన్ 27 ప్రభాతవార్త



మండలంలోని పుట్టిన బిడ్డ నుండి 5 సంవత్సరాల లోపు పిల్లలందరికి రెండు పోలియో చుక్కలు తప్పనిసరిగా వేయించాలని మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధి కారి డాక్టర్ డి. ప్రత్యూష ప్రజలకు విజ్ఞప్తి చేశారు, ఈ సందర్భంగా ఆమె శనివారం ప్రభుత్వ ఆసుపత్రి లో మాట్లాడుతూ ఆదివారం 26 పల్స్ పోలియో కేంద్రాలలో 3764 మంది పిల్లలకు వేయడం జరుగుతుందని, ఉదయం ఏడు గంటల నుండి సాయంత్రం ఐదు వరకు నిర్వహించడం జరుగుతుందన్నారు, కావున ప్రజలు ఈ కేంద్రాలలో పోలియో చుక్కలు వేయించడం చాలా మంచిదన్నారు, ఆరోజు ఇళ్లలో లేని పిల్లలకు, ఎక్కువ జ్వరం, విరోచనాలతో భాదపడుతున్న పిల్లలకు సోమవారం, మంగళవారం ప్రతి ఇంటిని సందర్శించి పల్స్ పోలియో చుక్కలు వేయడం జరుగుతుందన్నారు, కావున ప్రజలు పిల్లలందరికి పోలియో చుక్కలు వేయించి పోలియో రహిత మండలంగా మార్చాలన్నారు ఈ సమావేశంలో డాక్టర్ డి.ప్రత్యూష పి హెచ్ సి సిబ్బంది పాల్గొన్నారు.

# ఘనంగా శ్రీ సీతారామాలయం
## విగ్రహ, కలశ, ధ్వజ ప్రతిష్ట మహోత్సవం



ప్రొద్దుటూరు అర్బన్, జూలై 27 ప్రభాతవార్త

ప్రొద్దుటూరు మండలం మండలం నంగనూరు పల్లె గ్రామంలో శనివారం నూతనంగా నిర్మించిన సీతా రామాలయంలో సీతా రాముల విగ్రహాల ప్రతిష్ట, ధ్వజస్తంభ ప్రతిష్ట, కలస ప్రతిష్ట ఘనంగా జరిగింది. గ్రామ పెద్దల ఆధ్వర్యంలో జరిగిన ఈ మహోత్సవంలో హోమాలు,గణపతి పూజ, శ్రీ సీతారామాంజనేయుల పూజలు కోలా హోలంగా నిర్వహించారు. మధ్యాహ్నం అన్నదానం, రాత్రి గ్రామోత్సవం, సాంస్కృతిక కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ పెద్దలు క్రిష్టిపాటి మంజునాథ శర్మ, షావలి వెంకట రమణ మాట్లాడుతూ తమ గ్రామంలో ఇంత పెద్ద ఎత్తున సీతారామ విగ్రహ ప్రతిష్ట ధ్వజస్తంభం ప్రతిష్ట జరగడానికి ముఖ్య కార్యనిర్వాహకుడిగా ప్రొద్దుటూరు బంగారు వ్యాపారి ఎస్డిఎస్ జ్యువెలర్స్ అధినేత అహ్మద్ హుస్సేన్ ఎంతో పెద్ద మనసుతో ఈ కార్యక్రమానికి సహాయం చేశారన్నారు. ఈ సందర్భంగా ఇక్కడికి వచ్చిన ప్రముఖులకు గ్రామ ప్రజలకు తాము ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రొద్దుటూరు ఏఎస్పి విబు కృష్ణ, మాజీ ఎమ్మెల్సీ దేవగుడి నారాయణరెడ్డి, టిడిపి నాయకుడు సురేష్ నాయుడు, కొత్తపల్లె మాజీ సర్పంచ్ శివచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సత్యనారాయణ నాయుడు, భైరగాని నాగ మునయ్య, షావలి వెంకటరమణ, మేకల వెంకటనారాయణ, శివేరి నాగేశం, శావలి శివయ్య, భైరగాని డాక్టర్ గుర్రప్ప, నడిపి గురప్ప, షావలి గంగిరెడ్డి, భైరగాని బాలయ్య, షావలి గోపాల్, షావలి గంగిరెడ్డి, గ్రామ ప్రజలు భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# ఘనంగా ఏటి గంగమ్మ విగ్రహ ప్రతిష్ట



సిద్దవటం జూన్ 27 ప్రభాతవార్త

నూతన ఏటి గంగమ్మ, అమ్మవారు, పోతురాజుల విగ్రహ ప్రతిష్టకు భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారి నీ దర్శించుకున్నారు అమ్మవారిని విగ్రహాన్ని రాజంపేట పార్లమెంట్ ఉపాధ్యక్షులు పుత్త రామచంద్రయ్య, పోతురాజు విగ్రహాన్ని మనోహర్ రెడ్డి ఆర్టీసీ కండక్టర్, ఇరువురు విగ్రహాలను సమర్పించగా అమ్మవారి ప్రత్యేక చండీ హోమం కు రాజంపేట పార్లమెంటు సమన్వయకర్త అతికారి కృష్ణ సహకరించారు. పెద్దపల్లి గ్రామస్తులు సహకారంతో అమ్మవారి గుడి నిర్మాణం చేసి విగ్రహ ప్రతిష్ట వైభవంగా చేశారు ఈ సందర్భంగా వేద పండితుడు సురేష్ బాబు మాట్లాడుతూ నూతన అమ్మవారి విగ్రహ ప్రతిష్ట సందర్భంగా గణపతి పూజ పుణ్యాహవాచనం, పూర్ణాహుతి చండీ హోమం మంగళ హారతి వంటి విశేష పూజలు నిర్వహించామని అమ్మవారి ఆలయ నిర్మాణానికి సహకరించిన ప్రతి ఒక్కరికి, వ్యాపార , విద్య, ఉద్యోగ, అవకాశాల్లో అమ్మవారి అనుగ్రహం ఆశీస్సులు ఉంటాయని తెలిపారు సిద్దవటం ఎస్ ఐ హరికాకు ఆలయ నిర్వాహకులు సన్మానం చేశారు. భక్తులకు అమ్మవారి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

# పాఠశాలల నుంచి అంగనవాడీ వరకు నాణ్యమైన సేవలందించాలి

మదనపల్లి జూన్ 27 ప్రభాతవార్త



పాఠశాలల నుంచి అంగన్వాడి వరకు నాణ్యమైన సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ తెలిపారు.మదనపల్లి కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో శనివారం జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ హ్యూమన్ రిసోర్స్ డెవలప్మెంట్ శాఖలు అయిన పాఠశాల విద్య, సమగ్ర శిక్ష, ఇంటర్మీడియట్ విద్య, ఐసీడీఎస్, నైపుణ్యాభివృద్ధి సంస్థల జిల్లా అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించి ఆయా శాఖల ద్వారా అమలవుతున్న కార్యక్రమాలను సమీక్షించి తీసుకోవాల్సిన చర్యలపై దిశా నిర్దేశం చేశారు. ఉపాధ్యాయుల వర్క్ అడ్జస్ట్మెంట్ ప్రక్రియను పారదర్శకంగా, సీనియారిటీ ఆధారంగా పూర్తి చేయాలని కలెక్టర్ సూచించారు. విద్యార్థుల సంఖ్య పెరుగుదల, తగ్గుదల ఆధారంగా పాఠశాలల అవసరాలకు అనుగుణంగా సిబ్బంది సర్దుబాటు చేపట్టాలని తెలిపారు. ఉపాధ్యాయులు, ఎంఈఓలు, ప్రధానోపాధ్యాయులతో ప్రత్యేక సమావేశాలు నిర్వహించి విద్యార్థుల సామర్థ్యాలను మెరుగుపరిచే చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రతి పాఠశాలలో తాగునీటి నాణ్యత పరీక్షలు క్రమం తప్పకుండా నిర్వహించాలని, మధ్యాహ్న భోజన పథకంలో నాణ్యత, పరిశుభ్రత, వంట ప్రక్రియను ఉపాధ్యాయులు మరియు హెడ్‌మాస్టర్లు ప్రత్యక్షంగా పర్యవేక్షించాలని ఆదేశించారు. విద్యార్థుల్లో ప్రేరణ కల్పించేందుకు నిపుణులతో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని చెప్పారు. అంగనవాడీ కార్యకర్తలు, ఆయాలు నిర్ణీత సమయానికి కేంద్రాలకు హాజరై సేవలు అందించాలని కలెక్టర్ ఆదేశించారు. సీడీపీఓలు, సూపర్వైజర్లు ప్రతిరోజూ కనీసం రెండు అంగనవాడీ కేంద్రాలను సందర్శించి పర్యవేక్షించాలని, ముఖ్యంగా మారుమూల ప్రాంతాల కేంద్రాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. అలాగే జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో జాబ్ మేళాలను నిర్ణయించిన గడువులోగా నిర్వహించాలని, ప్రతి జాబ్ మేళాలో ఉద్యోగ నియామకాల శాతాన్ని పెంచేలా ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని సూచించారు. ఈ సమావేశంలో డీఈఓ సుబ్రమణ్యం, సమగ్ర శిక్ష ప్రాజెక్టు అధికారి అనురాధ, ఇంటర్మీడియట్ జిల్లా కోఆర్డినేటర్ రవి, ఐసిడిఎస్ పిడి హైమావతి, స్కిల్ డెవలప్మెంట్ అధికారి దాసరి నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

# ఓటర్ల జాబితా సవరణ ముమ్మరం



వేంపల్లె జూన్ 27 ప్రభాతవార్త)

పులివెందుల ఆర్డీవో చిన్నయ్య మాట్లాడుతూ స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్‌లో భాగంగా వేంపల్లె, చక్రాయపేటతో పాటు ఏడు మండలాల్లో ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ ముమ్మరంగా సాగుతోందన్నారు. వేంపల్లె సభా భవనంలో శనివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఓటర్లకు అందజేసే ఎపిక్ కార్డుల పంపిణీ 95 % పూర్తయిందని తెలిపారు. మొదటి దశ పూర్తి కాగా, ప్రస్తుతం రెండవ దశలో డిజిటలైజేషన్ మరియు ఆన్‌లైన్ ప్రక్రియను వేగవంతం చేస్తున్నామన్నారు. ఓటర్లలో అవగాహన కల్పించేందుకు ప్రతి మండలంలో బీఎల్‌ఓలకు ప్రత్యేక శిక్షణ, సమావేశాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. భారత ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం ప్రతి 20 మంది బీఎల్ఓలకు ఒక ఏఈఆర్వోను నియమిస్తున్నట్లు వెల్లడించారు. ఎంపీడీఓ, డిప్యూటీ ఎంపీడీఓల పర్యవేక్షణలో క్షేత్రస్థాయిలో ఎటువంటి పొరపాట్లు లేకుండా ఓటర్ల జాబితా సవరణను పకడ్బందీగా పూర్తి చేస్తామని ఆర్డీవో స్పష్టం చేశారు. ఈ సమావేశంలో వేంపల్లె తహసీల్దార్ శివశంకర్ రెడ్డి, చక్రాయపేట తహసీల్దార్ విజయ కుమారి, ట్రైనింగ్ తహసీల్దార్ అజయ్ పాల్గొన్నారు.

### అంగన్వాడీ కేంద్రాలకు ప్రభుత్వం ఉచితంగా
# ఇండక్షన్ స్టవ్‌లు, వంట పాత్రలు పంపిణీ



ఇండక్షన్ స్టవ్‌లను పంపిణీ చేస్తున్న పురం రామ్మూర్తి

పీలేరు జూన్ 27 ప్రభాతవార్త:

అంగన్వాడీ కేంద్రాల్లో పిల్లలకు, గర్భిణులకు పౌష్టికాహారం వండేందుకు ప్రభుత్వం ఉచితంగా అందజేస్తున్న ఇండక్షన్ స్టవ్‌లు, వంట పాత్రలను పీలేరు మార్కెట్ యార్డ్ ఛైర్మన్ పురం రామ్మూర్తి శనివారం అంగన్వాడి సెంటర్లకు అందజేశారు. పీలేరు నియోజకవర్గ శాసనసభ్యులు నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి ఆదేశాల మేరకు, పీలేరు పట్టణంలోని యల్లమంద క్రాస్‌లోని తలపల 2 సెక్టార్‌లో జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన చైర్మన్ పురం రామ్మూర్తి మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అంగన్వాడీ వ్యవస్థను బలోపేతం చేసేందుకు అనేక చర్యలు తీసుకుంటున్నారని అన్నారు. అందులో భాగంగానే ప్రభుత్వం ప్రతి అంగన్వాడీ కేంద్రానికి ఆధునిక ఇండక్షన్ స్టవ్‌లు, నాణ్యమైన వంట పాత్రలు అందజేస్తోందని, ఈ స్టవ్‌లు వాడటం వలన ఇంధన పొదుపును ప్రోత్సహించడం, కాలుష్యాన్ని తగ్గించడం, సమయం కూడా కలిసి వస్తుందని తెలిపారు. పీలేరు అంగన్వాడీ ప్రాజెక్టు సీడీపీఓ రాజమ్మ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా 44,346 అంగన్వాడీ కేంద్రాలకు 32 కోట్ల అంచనా వ్యయంతో ప్రభుత్వం అందిస్తున్న ఈ ఇండక్షన్ స్టవ్‌ల వలన పొగ బెడద ఉండదు. టీచర్లు, ఆయాలకు వంట చేయడం సులభమవుతుందని పిల్లలకు వేడి వేడిగా, పరిశుభ్రమైన ఆహారం త్వరగా అందించవచ్చని అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గారికి, చైర్మన్ రామమూర్తి కు కృతజ్ఞతలు తెలిపారు. పీలేరు ప్రాజెక్టులో 223 అంగన్వాడి కేంద్రాలు ఉన్నాయని, ఇప్పుడు 24 సెంటర్లకు అందజేస్తున్నామని మిగతా వారందరికి త్వరలో పంపిణీ చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ డైరెక్టర్ గోళ్ళ కిషోర్ నాయుడు, అంగన్వాడీ సూపర్‌వైజర్ అక్కయ్య, అంగన్వాడీ టీచర్లు, ఆయాలు, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# రైతులు, ప్రజలు పలు సబ్సిడీ పథకాలు పొందండి



మైదుకూరు, జూన్ 27, ప్రభాతవార్త:

మైదుకూరు ఎంపీడీవో శ్రీధర్ నాయుడు, ఎంపీపీ థామస్ ఆధ్వర్యంలో మైదుకూరు మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశంలో వివిధ శాఖల అధికారులు ప్రజలకు, రైతులను ఉద్దేశించి పలు కీలక సూచనలు చేశారు. ఎంఈఓ పద్మలత మాట్లాడుతూ, ఈ ఏడాది విద్యార్థులు చదువులో ప్రతిభ కనబరిచారని, ట్రిపుల్ ఐటీలో ఐదుగురు విద్యార్థులు సీట్లు సాధించారని తెలిపారు. విద్యార్థులకు ఇప్పటికే దుస్తులు, పుస్తకాలు, ఇతర మెటీరియల్ పంపిణీ పూర్తయిందన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు ప్రభుత్వ బడుల్లో విద్యార్థులను చేర్పించి ప్రభుత్వ పథకాలు పొందాలని సూచించారు. మండల వ్యవసాయ అధికారి శివశంకర్ రెడ్డి మాట్లాడుతూ, పీఎం కిసాన్, సుఖీభవ, ప్రభుత్వ సహాయం రైతుల ఖాతాల్లో జమ కావడంతో ఈ సీజన్‌లో పంట పెట్టుబడికి భరోసా లభిస్తుందన్నారు. ప్రభుత్వ పథకాలు అందాలంటే ప్రతి పంట యాప్‌లో నమోదు తప్పనిసరి అని స్పష్టం చేశారు. హార్టికల్చర్ అధికారి రామకృష్ణ మాట్లాడుతూ, జూన్‌జూలైలో పసుపు సాగు విస్తీర్ణం పెరిగే అవకాశం ఉందని, రైతులంతా యాప్‌లో నమోదు చేసుకోవాలని కోరారు. రెవెన్యూ ఎలక్షన్ అధికారి డీటీ చంద్రకళ మాట్లాడుతూ, మండలంలో రెవెన్యూ సమస్యలు చాలా వరకు తగ్గాయన్నారు. ప్రస్తుతం ఎస్ఐఆర్‌పై బీఎల్‌వోలు ఇంటింటికీ తిరుగుతూ ఓటర్లకు పత్రాలు పంపిణీ చేస్తున్నారని, వారికి సహకరించాలని కోరారు. భరత్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ, వర్షాకాలం నేపథ్యంలో గ్రామాల్లో నీటి సరఫరా, ట్యాంకుల పరిశుభ్రత, తుప్పు పట్టిన పైపులైన్లు, శానిటేషన్, ఫ్లోరైడ్ సమస్యలను అధికారులు ఎప్పటికప్పుడు చూస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీధర్ నాయుడు, ఎంపీపీ థామస్, నాగేంద్ర బాబు, ఎంఈఓ పద్మలత, మండల వ్యవసాయ అధికారి శివశంకర్ రెడ్డి, ఎలక్షన్ అధికారి డీటీ చంద్రకళ, హార్టికల్చర్ రామకృష్ణ, గురువి రెడ్డి, చైతన్య, ఐసీడీఎస్ శ్రీదేవి, జయమ్మ, భరత్ కుమార్ రెడ్డి, జడ్పీటీసీలు, సర్పంచులు, తదితరులు పాల్గొన్నారు. గ్రామాలలో చిన్న చిన్న రెవెన్యూ సమస్యలు అధికంగా ఉన్నాయని వాటిని పరిష్కరించడంలో వీఆర్వోలు, ఆర్ ఐలు, ప్రజలకు సకాలంలో పనులు చేయడం లేదని రీ సర్వే జరిగే గ్రామాలలో పూర్తిస్థాయిలో ప్రజలకు సమాచారాన్ని అధికారులు తెలపడం లేదని పలువురు అభిప్రాయపడ్డారు.

# జగన్‌పై అవమానకర
# వ్యాఖ్యలు చేశారంటూ ఫిర్యాదు



పులివెందుల, జూన్ 27, ప్రభాతవార్త :

మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డిని ఉద్దేశించి కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం వెంకటేశ్వరరావు అలియాస్ నానాజీ చేసిన వ్యాఖ్యలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ పులివెందుల అర్బన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు వైసీపీ నాయకులు శనివారం స్టేషన్ హౌస్ ఆఫీసర్‌కు వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ నెల 21న కాకినాడ రూరల్ ఎమ్మెల్యే నిర్వహించిన మీడియా సమావేశంలో మాజీ సీఎం జగన్ మోహన్ రెడ్డిని ఉద్దేశించి అవమానకరమైన, అసభ్యకరమైన వ్యాఖ్యలు చేశారని ఆరోపించారు. రాజకీయ విమర్శలకు పరిమితులు ఉంటాయని, అయితే వ్యక్తిగతంగా కించపరిచే విధంగా వ్యాఖ్యలు చేయడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని పేర్కొన్నారు.సదరు వ్యాఖ్యలకు సంబంధించిన వీడియోలు, వార్తా కథనాలు సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా ప్రచారం అవుతున్నాయని ఫిర్యాదులో తెలిపారు. దీని వల్ల రాజకీయ వర్గాల మధ్య, ప్రజల మధ్య ఉద్రిక్తతలు ఏర్పడే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజలను రెచ్చగొట్టే విధంగా ఉన్న వ్యాఖ్యలపై సమగ్ర విచారణ చేపట్టి, సంబంధిత వ్యక్తులపై చట్ట ప్రకారం కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరారు.ఈ కార్యక్రమంలో వైసీపీ పట్టణ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# వెల్లాలను పరిశీలించిన రాష్ట్ర స్థపతి

రాజుపాలెం, జూన్ 27, ప్రభాతవార్త



మండల పరిధిలోని వెల్లాల పుణ్య క్షేత్రంలో నూతనంగా నిర్మించి ప్రారంభోత్సవం ఒక సిద్ధంగా ఉన్న శ్రీ సంజీవరాయ స్వామి ఆలయం ను, త్వరలో నూతనం గా నిర్మించబోవు శ్రీ చెన్నకేశవ స్వామి ఆలయం ను శనివారం రాష్ట్ర దేవాదాయ శాఖ కమిషనర్ కార్యాలయం నుండి వచ్చిన రాష్ట్ర స్థపతి బి. పరమేశ్వరప్ప పరిశీలించి దేవాదాయ శాఖ ఇంజనీర్లకు, అధికారులకు మరియు సూచనలు సలహాలు దిశా నిర్దేశములను సూచించారు. త్వరలో ప్రారంభోత్సవనకు సిద్ధంగా ఉన్న శ్రీ సంజీవరాయ స్వామి ఆలయం నిర్మాణం పనులను స్థపతి క్షుణ్ణంగా పరిశీలించి శాస్రోత్తమైన దిశా నిర్దేశములను సంబంధిత అధికారులకు సూచించారు. దీంతోపాటు త్వరలో నూతనంగా నిర్మించబోవు మరొక ఆలయం శ్రీ చెన్నకేశవ స్వామి నూతన ఆలయ నిర్మాణం నమూనా చిత్రపటంను పరిశీలించి ప్రస్తుతమున్న ఆలయం ప్రదేశంలో నిర్మాణం పనులు చేపట్టుటకు కావలసిన కొలతలను చూపించి, ఆలయ కమిటీ చైర్మన్, ఈవో ఇతర నాయకుల అభిప్రాయాలను అడిగి తెలుసుకొని దేవాదాయ శాఖ ఇంజనీర్లకు తగు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ జి ఎల్ నారాయణరెడ్డి, ఈవో వెంకటరమణ, ఇంజనీర్ శ్రీనివాస్, మాజీ చైర్మన్ రామ సుబ్బారెడ్డి, కమిటీ మెంబర్ నరసింహారెడ్డి, ఆలయ పండితులు, సీనియర్ అసిస్టెంట్ రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

# 90 మందికి ఉచిత వైద్య సేవలు

దువ్వూరు, జూన్ 27, ప్రభాతవార్త:

మండల పరిధిలోని చింతకుంట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని బాలాయపల్లె గ్రామంలో శనివారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించి 90 మందికి వైద్య సేవలు అందించినట్లు వైద్యాధికారి డాక్టర్ రోషిణి తెలిపారు. బాలాయపల్లె గ్రామంలో ఎక్కువ మందికి వివిధ రకాల జ్వరాలు, దగ్గు, జలుబు ఉన్నాయని తెలియడంతో జిల్లా వైద్య శాఖ అదేకారుల ఆదేశాలతో వైద్య శిబిరం నిర్వహించామన్నారు. ఈ శిబిరంలో 90 మందికి వైద్య పరీక్షలు నిర్వహించామని అలాగే కొందరికి రక్త పరీక్షలు నిర్వహించగా 5 మందికి జ్వరాలు ఉన్నట్లు గుర్తించామన్నారు. మిగతా వారికే సాధారణ జబ్బులు ఉన్నట్లు పేర్కొన్నారు. గ్రామంలో జ్వరాలు వచ్చేందుకు ప్రధానంగా త్రాగు నీటి పైప్ లైన్ దెబ్బ తినడం, గుంతలలో నీరు నిల్వ ఉండడం కారణం అన్నారు. గ్రామంలో ఫీవర్ లార్వా సర్వే నిర్వహించి ప్రజలకు ఆరోగ్య విషయాల గురించి తెలియజేశారు. దోమలు వృద్ధి చెందకుండా అబేట్ అనే ద్రావకాన్ని పిచికారి చేయించి బ్లీచింగ్ పౌడర్ చల్లించారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది రాజగోపాల్, శివ గంగరాజు, జనార్దన్ రావు, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.




# కొండపేటలో వైభవంగా విగ్రహ ప్రతిష్ట



కలసపాడు, జూన్ 27 ప్రభాతవార్త:

మండలంలోని కొండపేట గ్రామంలో శనివారం శ్రీ రామ చంద్ర స్వామి దేవాలయ ధ్వజ శిఖర కలశ ,ప్రతిష్ట, మరియు వేణుగోపాలస్వామి వెంకటరెడ్డి ,జేజి నాయన ,కాశినాయన, వీరబ్రహ్మేంద్ర స్వామి వారి నూతన విగ్రహ ప్రతిష్ట కార్యక్రమాలు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పురోహితులు బ్రహ్మశ్రీ వారణాసి వెంకటరమణ శర్మ పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం సీతారాముల కళ్యాణం వైభవంగా నిర్వహించారు కళ్యాణం తిలకించేందుకు వివిధ గ్రామాల నుండి పెద్ద ఎత్తున మహిళలు భక్తులు పాల్గొన్నారు వచ్చినటువంటి భక్తులకు అన్నదాన కార్యక్రమం గ్రామ ప్రజలు చేశారు. అనంతరం బండలాగుడు పోటీలు నిర్వహించారు గెలుపొందిన వృషభ రాశి లకు బహుమతులను గ్రామ పెద్దలు బహూకరించారు.

# దేవేంద్రకు కృత్రిమ కాలు చేతులు

పీలేరు జూన్ 27 ప్రభాతవార్త:

విద్యుద్ఘాతంతో రెండు చేతులు, ఓ కాలు కోల్పోయి ఇంటికే పరిమితమైన ఓ యువకుడికి రూ.6.35 లక్షలతో కృత్రిమ కాలు, చేయి ప్రసాదించిన ఎంపీ మిథున్ రెడ్డి మానవత్వానికి నిలువెత్తు నిదర్శనంగా నిలిచారు. పీలేరు మండలం బాలంవారిపల్లె పంచాయతీ తూగుంటపల్లెకు చెందిన టి. కృష్ణయ్య. భారతమ్మల కుమారుడు టి. దేవేంద్ర బీటెక్ పూర్తి చేశాడు. 2024 ఆగష్టు 15న తమ వ్యవసాయం పొలం వద్దకు వెళ్లిన దేవేంద్ర మోటారు మరమ్మతు పని చేస్తూ ప్రమాదవ శాత్తు విద్యుద్ఘాతానికి గురై రెండు చేతులు. కుడి కాలు కోల్పోయాడు. దీంతో చికిత్సపొంది ఇంటిల్లో మంచానికే పరిమితమయ్యాడు. నిస్సాయస్థితిలో ఉన్న దేవేంద్రను ఆదుకోవడానికి స్థానిక వైఎస్సార్సీపీ నాయకులు విషయాన్ని ఎంపీ మిథున్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఎంపీ ఎంపీ ల్యాడ్స్ నిధులు రూ.6.35 లక్షల వెచ్చించి ఒక కృత్రిమ కాలు, చేయి ఆధునాతన టెక్నాలజీతో దేవేంద్రకు అమర్చారు.

# బద్వేల్‌లో నేడు ప్రత్యేక ఎన్యుమరేషన్ డ్రైవ్

బద్వేల్ అర్బన్, జూన్ 27, ప్రభాతవార్త



జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఆదివారం, జూన్ 28న సెలవు దినమైనప్పటికీ బద్వేల్ పట్టణంలోని గాంధీనగర్, అశోక్ నగర్ స్వర్ణ వార్డుల్లో ఎన్నికల ఎన్యుమరేషన్ ప్రత్యేక డ్రైవ్ నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమీషనర్ యం. కృష్ణ తెలిపారు. గాంధీనగర్ స్వర్ణ వార్డు పరిధిలోని ఉద్యోగులందరూ న్యూ మున్సిపల్ కార్యాలయంలో, అశోక్ నగర్ స్వర్ణ వార్డు పరిధిలోని ఉద్యోగులు వార్డు కార్యాలయంలో పూర్తి స్థాయిలో అందుబాటులో ఉంటారని ఆయన పేర్కొన్నారు. సర్ కు సంబంధించిన నమోదు, సవరణలు, ఇతర సమస్యల పరిష్కారానికి ప్రజలకు సహాయ సహకారాలు అందిస్తారని తెలిపారు. ఏవైనా సమస్యలు ఉంటే ఈ ప్రత్యేక అవకాశాన్ని వినియోగించుకుని సకాలంలో పరిష్కరించుకోవాలని పట్టణ ప్రజలకు కమీషనర్ విజ్ఞప్తి చేశారు. ప్రజలందరూ తప్పక పాల్గొని ఈ ప్రత్యేక డ్రైవ్‌ను విజయవంతం చేయాలని కోరారు. సర్ ప్రక్రియ పూర్తయ్యేంతవరకు ఇలాంటి ప్రత్యేక డ్రైవ్‌లు అందుబాటులో ఉంటాయని బద్వేల్ పురపాలక సంఘం తెలిపింది.

# అంగరంగ వైభవంగా పీర్ల పండుగ సరిగీసు

రామసముద్రం జూన్ 27 ప్రభాతవార్త

మండలంలోని దిగువ పేట, ఎగువ పేట గ్రామల్లో శనివారం పీర్ల పండుగను గ్రామ ప్రజలు అంగరంగ వైభవంగా నిర్వహించారు, సాయంత్రం అగ్నిగుండం ప్రత్యేక సధివింపులు (ప్రత్యేక పూజలు )చేసి గుండం అట్టించారు, గుండం చుట్టూ పులి వేషాలు, తదితర వేషాలతో జరుపుకున్నారు,పీర్ల చావడి బాబయ్యలు దగ్గర పచ్చని చలువ పందిళ్ళు వేసి రంగు రంగుల విద్యుత్ దీపాలంకరణతో ముస్తాబు చేశారు,హిందూ ముస్లిం పెద్దలు యువత పీర్ల చావడి దగ్గర సేమ్, ధూల్లె, హైప రజ పీర్ల పండుగ అంటూ సావు పోన్ తొక్కారు, రాత్రి భక్తి శ్రద్దలతో హిందూ ముస్లిం భక్తులు మట్టి కుండలో పానకాలు మోసి చావడి వద్దవరకు వెళ్లి బాబయ్యలు గంధపు పీర్ల, షారాలు కట్టి స్వామి వార్లకు మొక్కులు చెల్లించారు,భక్తులు చెక్కర, బూంది సమర్పించి భక్తిని చాటుకున్నారు,పీర్ల పండుగ ను తిలకించడానికి కర్ణాటక, తమిళనాడు, తెలంగాణ నుండి తదితర జిల్లా ప్రాంత వాసులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పెద్దలు, యువత,ప్రజలు మహిళలు అధిక సంఖ్యలో బంధువులతో పాల్గొని సంబరాలు జరుపుకున్నారు, పీర్ల మహోత్సవానికి తిలకించడానికి విచ్చేసిన భక్తులకు పీర్ల చావడి బాబయ్య దగ్గర గ్రామస్థులు ఆధ్వర్యంలో అన్నసంతర్పణ చేశారు. మొహరం సందర్భంగా తిరుమలరెడ్డి పల్లె గ్రామంలో సరిగీ సు సందర్భంగా గ్రామస్థులు ఆధ్వర్యంలో అన్నసంతర్పణ నిర్వహించారు.ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా ఎస్సై హృషికేశవరెడ్డి పోలీస్ బందొబస్త్ నిర్వహించడం జరిగింది.



# ప్రజలకు మెరుగైన సౌకర్యం

రాయచోటి జూన్ 26 ప్రభాతవార్త

అన్నమయ్య జిల్లా రాయచోటి పురపాలక సంస్థ పరిధిలో సార్" కార్యక్రమాన్ని కలెక్టర్ ఈరోజు పరిశీలించారు. అన్నమయ్య జిల్లా రాయచోటి ఆర్డిఓ శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి, రాయచోటి మండల తహసిల్దార్ జానపాటి యామిని మరియు ప్రజలతో మమేకమై కార్యక్రమం అమలు తీరును అధికారులతో సమీక్షించి, పలు వార్డులలో పర్యటించారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించేలా చర్యలు తీసుకోవాలని ఆయన అధికారులకు సూచించారు.

### మట్టి పొడి పొడిగా ఉండే భూమిలో
# నీరు సమృద్ధిగా ఇంకుతుంది

సుండుపల్లె, జూన్ 27,ప్రభాతవార్త :

జిల్లా అధికారుల ప్రోటోకాల్ ప్రకారం 27 వ తేది ఎన్ ఎఫ్ పొలాలను సందర్శించే కార్యక్రమంలో డిఎంటి వీరనాగయ్య పొలంలో ఐదంతస్తుల నమూనాలలో సాగు చేయబడిన ఏటీఎం ఏ గ్రేడు మోడల్స్ లోమట్టి నమూనాను పరిశీలించిగా మట్టి యొక్క స్వభావాన్ని మట్టి పొడిపొడిగా ఉండి భూమిలోని నీరు బాగా సమృద్ధిగా ఇంకుతుందని రైతుకు తెలియజేయడం జరిగినది. తరువాత ప్రక్కనే ఉన్న రసాయనిక వ్యవసాయ రైతు పొలం మట్టి నమూనాల సేకరించి మట్టి యొక్క స్వభావాన్ని మట్టి గట్టిగా పేలాలు పేలాలుగా ఉండి రాతి లాగా ఉండడాన్ని గమనించిఅదేవిధంగా భూమి నరేలబారి ఉండడాన్ని రైతుకు వివరించడం జరిగినది. ఈ కార్యక్రమంలో డిఎంఎంటి వీరనాగయ్య రైతు, ఎన్ సిద్దయ్య, ఎఫ్ఎమ్టిలిమ్ రామ్మోహన్, ఎఫ్ఎం టిఇఎస్ వెంకటయ్య, ఆంజనేయులు నాయుడు, రెడ్డిచర్ల వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు.

